


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 24 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:178 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM




## ఇది తొలి అడుగు...

# ఏడాదిలో అభివృద్ధి ఏంటో చూపించాం

### రాష్ట్ర విభజన తర్వాత కూర్చోవడానికి చోటు లేదు



- బస్సులోనే పాలన ప్రారంభించాం
- అక్కడి నుంచే నిలదొక్కుకున్నాం
- సీఎం పదవి కొత్త కాదు
- మూడు పార్టీలు ఉన్నా ఎలాంటి సమస్యలు లేదు
- ఏడాది పాలన పూర్తి చేసుకోవడానికి పవన్ కళ్యాణ్, బీజేపీలే కారణం
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది
- ఏపీ సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్23(మనంబ్యూరో):** విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడతాం, పునర్నిర్మాణ దిశగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చామని, అందులో ఇది తొలి అడుగు అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ఏపీలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న కూటమి సర్కార్ అమరావతిలో సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో సీఎం చంద్రబాబు ప్రసంగం చేశారు.అన్నీ చేసేశామని చెప్పను కానీ, ఊహించిన దాని కంటే ఎక్కువ చేశామన్నారు. సీఎం పదవి తనకు కొత్త కాదని, ఇంత కంటే క్లిష్టమైన సందర్భాల్లో తాను సీఎంగా పనిచేశానన్నారు. 1994లో జీతాలివ్వలేని స్దితిలో ఉన్న ప్రభుత్వాన్ని నడిపించానన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కూర్చోవడానికి చోటు







లేకపోతే బస్సులోనే పాలన ప్రారంభించానన్నారు. అక్కడి నుంచి నిలదొక్కుకునేందుకు ప్రయత్నించామన్నారు.

పొలిటికల్ గవర్నెన్స్ కింద ఉమ్మడి మ్యానిఫెస్టో ఇచ్చామని, ప్రజలు కూటమిపై అభిమానంతో గెలిపించారన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులపై ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీయే డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుందో ఏడాదిలో చేసి చూపించామన్నారు. కేంద్రం సాయం లేకపోతే ఊపిరి కూడా పీల్చుకోలేని పరిస్ధితి ఉంటుందన్నారు. సాధారణంగా ప్రభుత్వాన్ని ఒక్క పార్టీ ఉంటేనే సమస్యలు ఉంటాయని, అలాంటిది మూడు పార్టీలు ఉన్నా ఎలాంటి సమస్యలు లేకుండా ఏడాది పాలన పూర్తి చేసుకోవడానికి పవన్ కళ్యాణ్, బీజేపీలే కారణమని చంద్రబాబు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు ఆకాంక్షల నుంచి అభివృద్ధి వరకూ ఉందన్నారు. చాలా ఇబ్బందులు కూడా ఉన్నాయన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా చెప్పిన మాట నిలబెట్టుకోవడానికి ఎన్డీయే కూటమి పనిచేస్తుందన్నారు. అది చేసే బాధ్యత ఇక్కడ ఉన్న యంత్రాంగంపై ఉందన్నారు.

గత వైసీపీ పాలనలో దుష్పరిపాలన నుంచి జనం భారీ మెజార్టీతో అధికారం ఇచ్చేవరకూ ఏం జరిగిందో చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

...మిగతా 2లో

### రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు అభివద్ధి: కందుల దుర్గేశ్



**రాజమండ్రి:** అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు ఈ నెల 26 కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వస్తున్నారని ఏపీ పర్యాటక శాఖ కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి పాల్గొంటారని చెప్పారు. రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టును అభివద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు. రాజమండ్రి హేవ్ లాక్ వంతెనను పర్యాటకంగా అభివద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే పుష్కర ఘాట్లను, కడియం నర్సరీలను అభివద్ధి చేస్తామన్నారు.

### ప్రజాసేవకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉంది: పురందేశ్వరి



**అమరావతి:** దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. ఏపీలో ఎన్డీయే కూటమి ఏడాది పాలన సందర్భంగా అమరావతిలో నిర్వహిస్తున్న 'సుపరిపాలన-తొలి అడుగు' సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం దేశంలోని 50 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ సేవలందిస్తోందని చెప్పారు. జీవన్‌జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన అమలు చేస్తున్నామని తెలిపారు. ఇంటింటికీ నీటిసరఫరా చేస్తున్నామని వివరించారు. కొవిడ్ సమయంలో కేంద్రం అనేక ముందుజాగ్రత్త చర్యలు తీసుకుందని చెప్పారు. 'సుపరిపాలన - తొలి అడుగు' సదస్సుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

### మూడు రోజుల్లో ఉత్తర కోస్తాలో పలు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం

**అమరావతి:** దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇప్పటికే కశ్మీర్, సిమ్లా మీదుగా హిమాలయాల వరకు విస్తరించాయి. రెండు లేదా మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణం కంటే 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చినట్లు ఐఎండీ తెలిపింది. రుతుపవనాలతో ఉత్తర కోస్తాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. సుమారు గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేస్తోంది. మత్స్యకారులు



అప్రమత్తంగా ఉండాలని విశాఖ వాతావరణ శాఖ అధికారి రూపా హెచ్చరించారు.

### వైకాపా నేత పెద్దిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**ఢిల్లీ:** బుగ్గమఠం భూముల వ్యవహారంలో వైకాపా నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఏపీ హైకోర్టు ఇచ్చిన సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం నిరాకరించింది. పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం ముగించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకుంటుందని సుప్రీంకోర్టు వెల్లడించింది. కేసు మెరిట్స్‌లోకి తాము వెళ్లడం లేదని పేర్కొంది. హైకోర్టు మెరిట్స్ ఆధారంగా చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది. నేటి నుంచి రెండు వారాల పాటు యథాతథస్థితి కొనసాగించాలని ఆదేశించింది. ఆ తర్వాత ఉన్నత న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం అయినా తీసుకునే స్వేచ్ఛ ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

### ముమ్మాటికీ జగన్ నిర్లక్ష్యమే: వైఎస్ షర్మిల



**తిరుపతి:** పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ఏటూకూరు బైపాస్ వద్ద చీలి సింగయ్య మతికి ముమ్మాటికీ జగన్ నిర్లక్ష్యమే కారణమని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. చేసిన తప్పిదానికి క్షమాపణ చెప్పకుండా ఫేక్ వీడియో అని మభ్యపెట్టడం దారుణమన్నారు. తిరుపతిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ..

...మిగతా 2లో

# ముమ్మాటికీ జగన్ నిర్లక్ష్యమే: వైఎస్ షర్మిల

(మొదటి పేజీ తరువాయి)



జగన్ వ్యవహారశైలిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. మానవత్వం ఉంటే రూ.5 కోట్లో, రూ.10 కోట్లో పరిహారం ఇచ్చి క్షమించమని అడగాలి గానీ, ఐదేళ్లు నిద్రపోయి.. ఇప్పుడు ప్రజా సమస్యలంటూ బయల్దేరడం విడ్డూరంగా ఉందన్నారు.

''జగన్‌వి బలప్రదర్శన, జన సమీకరణ కార్యక్రమాలు తప్ప.. ప్రజల కోసం కాదు. డబ్బుంది, బలముందని జగన్ నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన జనసమీకరణాలకు అనుమతులు ఇవ్వొద్దని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. ఘటన జరిగిన సమయంలో కారులో ఉన్న వారందర్నీ విచారణకు పిలవాలి. కారు కింద ఓ మనిషి పడిపోయాడని కనీస స్పృహ లేదు. కారులో ఉన్న వాళ్లు అలాగే ముందుకు వెళ్లడం దారుణం. తప్పు జరిగితే ఒప్పుకోకుండా ఫేక్ అంటూ సమర్థించుకుంటారా? జగన్ సైడ్ బోర్డ్ మీద నిలబడి జనాలకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఆయన పర్యటనకు అనుమతి ఇచ్చింది దాదాపు 5 వాహనాలకే. కానీ, 50 వాహనాల్లో వెళ్లి, సైడ్ బోర్డుపై నిలబడి షేక్ హ్యాండ్ ఇస్తారా? ఇది జగన్ తప్పు కాదా? జగన్‌కి మానవత్వం అనే పదానికి అర్థం తెలియదు. మానవత్వం ఉంటే సింగయ్యను ఆస్పత్రికి ఎందుకు తీసుకెళ్లలేదు. ఆ కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎందుకు పరామర్శించలేదు? ఆ కుటుంబానికి జగన్ కనీసం రూ.10 కోట్లు పరిహారం ఇవ్వాలి'' అని షర్మిల డిమాండ్ చేశారు.

# ఏడాదిలో అభివృద్ధి ఎంతో చూపించాం

(మొదటి పేజీ తరువాయి)

**రాష్ట్రానికి వైసీపీ పాలన శరాఘాతంగా మారింది..**

2022 నాటికి రాష్ట్రానికి ఇక అప్పులు చేసే పరిస్థితి లేదని నీతి ఆయోగ్ రిపోర్ట్ ఇచ్చిందని, రాష్ట్రంలో నిధులు భారీగా దుర్వినియోగం చేయడం, మళ్లించడం చేశారన్నారు. ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి వైసీపీ పాలన శరాఘాతంగా మారిందన్నారు. ఇప్పుడు వాటిని సరిదిద్దే పనిలో ఉన్నట్లు చంద్రబాబు తెలిపారు. గత వైసీపీ పాలనలో సోలార్, పవన విద్యుత్ పేరిట భారీగా నిధులు దుర్వినియోగం చేశారన్నారు.రాష్ట్రంలో కూటమి ఇచ్చిన హామీల అమలు, కేంద్రం నుంచి అందుతున్న సాయంపై వివరాలను చంద్రబాబు వెల్లడించారు. 31 పారిశ్రామిక పాలసీల్ని తీసుకొచ్చామని, ఇవాళ మరో రెండు పాలసీలు తెస్తున్నామని తెలిపారు. ఈగల్, శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో తీవ్రవాదం, ముఠాల్ని లేకుండా చేసిన పోలీసు అధికారులు ఉన్నారని వారు ఇప్పుడు అదే స్థాయిలో పనిచేయాలన్నారు. గంజాయిని దాదాపుగా నిర్మూలించామని, ఎవరైనా గంజాయి పెంచినా, సేవించినా అదే చివరి రోజవుతుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల్ని కాపాడాలని, ఆడబిడ్డలకు రక్షణ ఉండాలన్నారు.



**రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే ఊరుకోం...**

రాజకీయ ముసుగులో నేరాలు చేయాలని చూస్తే ఈ రాష్టంలో కుదరదని చంద్రబాబు హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో తాను ఏడు రంగాలపై శ్వేతపత్రాలు ప్రకటించామన్నారు. ఆయా రంగాల్లో ప్రక్షాళన ప్రారంభించి ఏడాదిలో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. గతంలో ప్రభుత్వ భూముల్ని వాడి సైబరాబాద్ నిర్మించామని, అమరావతిలో ప్రభుత్వ భూములు లేకపోయినా ప్రజల సహకారంతో రాజధాని నిర్మిస్తున్నట్లు తెలిపారు.మూడేళ్లలో అమరావతి పనులు పూర్తి చేస్తాం, మళ్లీ వచ్చి ప్రారంభించాలని ప్రధాని మోడీని కోరామన్నారు. 2027 జూన్ లేదా డిసెంబర్ కల్లా పోలవరం పూర్తి చేస్తామన్నారు. బనకచర్ల రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. తెలంగాణ కూడా ఈ నీటిని వాడుకోవచ్చన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కూడా వేగంగా అమలు చేస్తున్నామన్నారు. ఉచిత బస్సు పథకంతో పాటే ఆటో డ్రైవర్లను ఆదుకునే కార్యక్రమం ప్రకటిస్తామన్నారు.పీ4 కార్యక్రమం విజయవంతం కోసం అందరూ సహకరించాలన్నారు. రాష్ట్రంలో ఏడాదిలో 9.34 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ ద్వారా 8.5 లక్షల ఉద్యోగాల కల్పన చేస్తున్నట్లు తెలిపారు.

# అక్కడ మా దేశపోళ్లున్నందునే..

## ఇరాన్‌కు రష్యా సాయం చేయకపోవడానికి కారణాలు వెల్లడించిన పుతిన్

## ఇజ్రాయెల్ దాదాపు రష్యన్ మాట్లాడే దేశమేనని వ్యాఖ్య



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇరాన్‌పై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా రణరంగంలోకి దిగి ఇరాన్‌పై యుద్ధం చేస్తోంది. ఇంత జరుగుతున్నా ఇరాన్ కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడంపై ప్రపంచానికే ఆశ్చర్యం కలిగించింది.. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందిస్తూ.. 'ఒకప్పటి సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్ కు చెందిన దాదాపు 20లక్షల మంది ఇజ్రాయెల్ లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడది దాదాపు రష్యన్ మాట్లాడే దేశమే. దానిని పరిగణనలోకి తీసుకునే ఈ ఉద్రిక్తతల్లో మేం తటస్థంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని సెయింట్ పీటర్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్ లో వెల్లడించారు. మిత్ర దేశాలపై రష్యా నిజాయతీని కొంతమంది విమర్శిస్తున్నారని, వారంతా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారేనని పుతిన్ మండిపడ్డారు. అరబ్ దేశాలతో తమకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందన్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్లో రష్యా పరిశీలక దేశంగా ఉన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదిలా ఉండగా.. ఇరాన్కు అణ్వాయుధాలపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ కు అణ్వాయుధాలను సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, వాటి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమైన వేళ.. తటస్థంగా ఉంటామంటూ పుతిన్ వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇరాన్‌లో మన ఇంజనీర్ అదృశ్యం

## అతన్ని తీస్కరావాలని విదేశాంగ శాఖకు ఆయన తండ్రి అభ్యర్థన

## ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్ నుంచి 1713 మంది భారతీయుల తరలింపు

**ఢిల్లీ, జూన్ 23:** పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో భారత్ కు చెందిన ఒక ఇంజనీర్ ఇరాన్ లో అదృశ్యమయ్యారు. బిహార్లోని సివాన్ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల సిరాజ్ అలీ అన్సారీ ఓ ప్రైవేటు కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం అతడితో పాటు మరో 30-35 మందిని సదరు కంపెనీ నెల రోజుల వర్క్ వీసాపై ఇరాన్లోని అరాక్ ప్రాంతంలో ఓ ప్లాంట్ నిర్మాణం కోసం పంపించింది. దీంతో సిరాజ్ జూన్ 9న సౌదీ అరేబియా మీదుగా ఇరాన్ చేరుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఇర్నా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దాడులు చేపట్టింది. వీరు ఉన్న అరాక్ ప్రాంతంలోనూ ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. దీంతో సిరాజ్తో పాటు మిగతావారిని ఓ రిఫైనరీ ప్లాంట్ టౌన్షిప్కు తరలించారు. అయితే ఆ తర్వాత నుంచి తమ కుమారుడి ఆచూకీ తెలియరావడం లేదని సిరాజ్ తండ్రి హజ్రత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 17న అతడితో చివరిసారిగా మాట్లాడానని, ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. తాను ఉంటున్న ప్రాంతానికి కేవలం కిలోమీటర్ దూరంలోనే పేలుడు సంభవించినట్లు సిరాజ్ తమతో చివరిసారిగా చెప్పినట్లు అతడి తండ్రి మీడియాకు వివరించారు.

# రిటైనింగ్ వాల్ కరకట్ట అభివృద్ధితో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు కృషి

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ తూర్పు, జూన్23 (మనం న్యూస్):** రిటైనింగ్ వాల్ కరకట్ట అభివృద్ధితో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్నట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు. సోమవారం నాడు ఆయన కృష్ణలంక ప్రాంతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీ శాలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ లక్ష్మీ శా, ఎన్.హెచ్.ఎ.ఐ, ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించటం జరిగిందన్నారు. జాతీయ రహదారి దాటేందుకు కృష్ణలంక ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. త్వరలోనే రాణిగారితోట, అమెరికన్ హాస్పటల్ ప్రాంతాల్లో వెహికల్ అండర్ పాస్ నిర్మిస్తామన్నారు. అలాగే 21వ డివిజన్ ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు కరకట్టపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామని, ఇందుకు సంబంధించి పరిశీలన చేసేందుకు ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులతో కలిసి ప్రాంతానికి రావటం జరిగిందన్నారు. అమరావతి రాజధానికి ముఖద్వారమైన విజయవాడను అభివృద్ధి చేయటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాణి గారి తోట, అమెరికన్ హాస్పటల్, సత్యం గారి హోటల్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 21వ డివిజన్ ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ పక్కన అభివృద్ధి పనులు పరిశీలించారు. ఆర్చి రోడ్డు చివర కరకట్ట నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు సమాలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్.హెచ్.ఎ.ఐ , ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని, తూర్పు నియోజకవర్గం కృష్ణలంక ప్రాంతంలోని ప్రజలు జాతీయ రహదారిని దాటేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి కృషి చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం కృష్ణలంకలోని రాణి తోట, సత్యం హోటల్, అమెరికన్ హాస్పటల్ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశా లతో ఎంపీ కేశినేని శివనాథ్ పర్యటించారు. ఎన్.హెచ్.ఎ.ఐ , ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో మాట్లాడి చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. అలాగే 21వ డివిజన్ ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ ను సందర్శించారు. ఆ ప్రాంతం నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు డెవలప్మెంట్ చేసి వాకింగ్ ట్రాకింగ్ నిర్మించే అంశంపై కలెక్టర్ లక్ష్మీశా తో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చర్చించారు. ముందుగా రాణి గారి తోట నుంచి పశువుల హాస్పటల్ కి వెళ్లే మార్గంలో జాతీయ రహదారి దగ్గర నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో త్వరగా వెహికల్ అండర్ పాస్ నిర్మించాలని , ప్రమాదాలు నివారించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, సిగ్నల్ వ్యవస్థ, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్.హెచ్.ఎ.ఐ పి.డి. విద్యాసాగర్ కు సూచించారు. అలాగే సత్యం గారి హోటల్ వద్ద యాక్సిడెంట్లు నివారించేందుకు సిగ్నల్ లైట్లు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాట్ల పై , కృష్ణలంక నుంచి అమెరికన్ హాస్పటల్ నుంచి బందురు రోడ్ వెళ్లేందుకు వెహికల్ అండర్ పాస్ నిర్మించే విషయంపై ఎన్.హెచ్ విజయవాడ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ పక్కన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కృష్ణనదీ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, ఈ ప్రాంతంలో నివసించే వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో 2014లో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూ. 500 కోట్ల రూపాయలతో అంచనాలతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదలైన సంగతి అందరికీ తెలిసిందే..రక్షణ గోడ నిర్మాణం వల్ల మురుగు నీరు నిల్వ వుంటుంది. ఈ మురుగునీరు నిల్వ వుండకుండా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రిటైనింగ్ వాల్ కి ఇళ్ల కి మధ్యలో వున్న 70 అడుగుల కరకట్టను సుందరీకరించేందుకు ఇరిగేషన్, వి.ఎం.సి అధికారుల సమన్వయంతో డిపిఆర్ తయారు చేయించనున్నట్లు తెలిపారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని సహించను

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, జూన్ 23 (మనం న్యూస్):** అర్జీల పరిష్కారంలో నాణ్యతకు, సంతృప్తి స్థాయికి ప్రాధాన్యమివ్వాలని, అలసత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోనని పునరావృతం కాకుండా అర్జీలకు పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ సోమవారం నాడు అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం లభిస్తుందని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్ను ఆశ్రయిస్తున్నారన్నారు. వారి నమ్మకానికి మరింత బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో పునరావృతం కాకుండా ఆర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశించిన సమయానికి సమస్యలకు పరిష్కారం చూపాల్సిందేనని ఈ విషయంలో ఏ మాత్రం అలసత్వం వహించినా సహించబోనని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. మానవతాదృక్పథంతో సానుకూలతతో సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలన్నారు. స్వీకరించిన ఆర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఇకపై ఆర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్ష నిర్వహిస్తానని ఆర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం నాడు ప్రజల నుంచి 189 అర్జీల స్వీకరించారు. శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 93, పోలీస్ శాఖకు 22, విద్య 12, ఎంఏయూడీ 10, అటవీ 5, పంచాయతీరాజ్ 5, సర్వే 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 4, ఏపిఎస్డబ్ల్యూఆర్ఇఐఎస్ 3, హౌసింగ్ 3, గ్రామీణ నీటి సరఫరా 3, వ్యవసాయం 2, సహకార శాఖ 2, విభిన్న ప్రతిభావంతులు 2, డీఆర్డీఏ పీడీ 2, ఉపాధి హామీ 2, హెల్త్ 2, విద్యుత్, పౌరసరఫరాలు, కళాశాల విద్య, డ్వామా, మత్స్య, జలవనరులు, కేడీసీసీ సీఈవో, కార్మిక శాఖ, బ్యాంకు, గనులు, ఆర్ అండ్ బీ, సాంకేతిక విద్యకు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 189 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అర్జీల స్వీకరణలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహేశ్వరరావు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా నందీశ్వరాభిషేకం



**మహానంది, జూన్24,మనంన్యూస్:** మహానంది పుణ్యక్షేత్రం లో నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రయుక్త జేష్ఠ బహుళ త్రయోదసి మహా ప్రదోషం సందర్భంగా నందీశ్వరుడు జన్మించిన మహానంది పుణ్యక్షేత్రం లో సాయంత్రం ప్రదోషకాల నందీశ్వరభిషేకం మహా వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, శాంతా రామ్ బట్,నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, అర్చకులు మూలస్థానం సుబ్బయ్య శర్మ,పరిచారకులు జనార్దన్ శర్మ ల ఆధ్వర్యంలో పంచామృతాలు, విశేష చూర్ణికలు,వట్టి వేరు, కురువేరు, మొదలగు శుద్ధ ద్రవ్యాలతో జరిగిన ప్రదోషకాల నందీశ్వర అభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దుర్గమ్మ గుడి అభివృద్ధికి విజన్ 2047

- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్
- భక్తుల మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**విజయవాడ పశ్చిమ, జూన్ 23(మనంన్యూస్):** దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సేవలను అందించడంతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తూ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం నాడు ఆయన విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని, ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ,దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ దేవస్థానం ఈఈలతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న వివిధ పనుల గురించి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే యాభై ఏళ్ల అవసరాలకు తగ్గట్లుగా శాశ్వత ప్రాతిపదికనలు, పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు బృహత్తర ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా దుర్గమ్మ ఆలయం లో భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఆలయానికి అనుసంధానంగా ఘాట్ రోడ్డు ఏర్పాటు, క్యూ లైన్ల ఆధునికీకరణ,వాహనాల పార్కింగ్, ప్రసాదాల తో పాటు అన్నప్రసాద కేంద్రం, కేశఖండనశాల, వెయిటింగ్ హాల్, రెస్ట్ రూమ్స్, ఎస్కలేటర్లు, లిఫ్టుతదితర అభివృద్ధి పనులను శాశ్వతంగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దుర్గమ్మ గుడి పరిసరాలలో ఆధ్యాత్మికతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా అనుకూల కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. దుర్గమ్మ గుడి అభివృద్ధికి సంబంధించిన డిపిఆర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిశీలించి ఆలయ అభివృద్ధిపై సలహాలు సూచనలను అందజేస్తున్నారని వెల్లడించారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి నేతృత్వంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ విజయవాడ వారిచే బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నారని అన్నారు. మరోమారు ఎమ్మెల్యే సుజనా చౌదరి సమక్షంలో సమీక్ష ఏర్పాటు చేసి సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

# కదం తొక్కిన అంగన్వాడీలు

- **సమస్యల పరిష్కారం కై కలెక్టరేట్ వద్ద ధర్నా**

**తిరుపతి కలెక్టరేట్,జూన్ 23,మనం న్యూస్ :** అంగన్వాడీలు రాష్ట్రంలో ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణం పరిష్కరించకుంటే రాష్ట్రంలో మరో చారిత్రక పోరాటాన్ని చూడాల్సి వస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి హెచ్చరించారు.

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల




పరిష్కారం కై సిఐటియు పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాలు ఎదుట సోమవారం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కందారపు మురళి ప్రసంగించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా రాష్ట్రంలో కష్టజీవుల పట్ల, కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి బాధ్యతా రాహిత్యంగా ఉందని, ఎన్నికలకు ముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం పరిపాటిగా మారిందని పాలకులను కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు.ఎన్నికలకు ముందు అంగన్వాడీల పోరాటానికి కూటమి నేతలందరూ పోటీలు పడి మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని అన్నారు.

ఏడాదికాలంగా అంగన్వాడీలు, మున్సిపాలిటీ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రి కి సమయం సరిపోలేదా? అని సూటిగా ప్రశ్నించారు. ఆదానీలు, అంబానీలకి రాష్ట్ర సంపదను పోటీపడి అప్పజెప్తున్నారని మురళి వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు కార్పొరేట్ శక్తులకు లాభం చేస్తామని కూటమి నేతలు చెప్పలేదని, అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు తప్ప మరేది కనబడడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే కూటమి ప్రభుత్వం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మలీల, ఎస్. వాణిశ్రీ, కోశాధికారి రాజేశ్వరి తదితరులు ప్రసంగిస్తూ ఐసిడిఎస్ పరిధిలో ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని రద్దు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ లుగా మార్చాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం పేరిట ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో చదువుకుంటున్న పిల్లలకు అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని స్కీమ్ వర్కర్లకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ పథకాల పరిధిలోకి రానివ్వకుండా ప్రభుత్వ సిబ్బంది గా చెబుతున్నారని, వచ్చే జీతాలు మాత్రం అరా కొరా వేతనాలతో చాలీ, చాలకుండా ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న రోజు వారి సమస్యలను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించకుంటే జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీలు సైతం భాగస్వాములు అవుతారని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఎస్. జయచంద్ర, మాధవ్, ఆర్. వెంకటేష్, వడ్డిపల్లి చెంగయ్య, నాగరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు ధనలక్ష్మి, శ్యామల, ఇంద్రాణి, నాగరాజమ్మ, ముని కుమారి, ప్రభావతి, నిర్మల, మంజుల, స్వరూప రాణి, పుష్ప, హైమావతి సౌజన్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదం కొనుగోలుకు నూతన సదుపాయం




- **కియోస్క్ యంత్రాల ద్వారా లడ్డూల విక్రయం**

**తిరుమల, జూన్ 23,మనం న్యూస్ :** తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం కోనుగోలుకు టీటీడీ నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుమలలోని లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రంలో భక్తులకు మరింత సులభతరంగా లడ్డూలను కోనుగోలు చేసేందుకు కియోస్క్ యంత్రాలను అందుబాటులో ఉంచింది. ఈ సదుపాయం ద్వారా భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించి త్వరితగతిన లడ్డూల కొనుగోలు ప్రక్రియ చేసేలా అవకాశం కల్పించడం జరిగింది. యూపీఐ చెల్లింపు సదుపాయం ద్వారా నగదు లేకుండా పారదర్శక లావాదేవీలు జరిగేలా టీటీడీ ఏర్పాటుచేసింది. భక్తులు లడ్డూ పంపిణీ కౌంటర్లకు సమీపంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం వద్దకు వెళ్తారు. యంత్రంలో రెండు ఆప్షన్లు కనిపిస్తాయి 1.దర్శన టికెట్ ఉన్నవారు, 2.దర్శన టికెట్ లేనివారు, దర్శన టికెట్ ఉన్నవారు, ఈ ఆప్షన్ ఎంచుకోండి. టికెట్ వివరాలను యంత్రం ధృవీకరిస్తుంది. టికెట్లో ఉన్న వ్యక్తుల సంఖ్య ఆధారంగా ప్రతి వ్యక్తికి రెండు అదనపు లడ్డూల వరకు కొనుగోలు చేయవచ్చు.

దర్శన టికెట్ లేనివారు ఈ ఆప్షన్ ఎంచుకుని సరైన ఆధార్ నంబర్ ఇవ్వాలి. ఈ మార్గం ద్వారా కూడా ప్రతి వ్యక్తికి 2 లడ్డూల వరకు కొనుగోలు చేయవచ్చు. సరైన ఆప్షన్ ఎంచుకున్న తర్వాత యూపీఐ ద్వారా చెల్లింపు చేయాల్సిన పేజీకి వెళ్లి లావాదేవీలు పూర్తి చేయవచ్చు.చెల్లింపు అనంతరం ముద్రిత రసీదు అందుతుంది. ఆ రసీదుతో లడ్డూ కౌంటర్ల వద్దకు వెళ్లి అదనపు లడ్డూలు పొందవచ్చు. భక్తుల సౌకర్యార్థం టిటిడి ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానానికి భక్తుల నుండి విశేష స్పందన లభిస్తోంది.

## జూన్ 26 నుండి జూలై 05వ తేదీ వరకు శ్రీ పెరియాళ్వార్ ఉత్సవం



**తిరుపతి,జూన్ 23,మనం న్యూస్ :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయానికి అనుబంధంగా వున్న శ్రీలక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో జూన్ 26 నుండి జూలై 05వ తేదీ వరకు శ్రీ పెరియాళ్వార్ ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం టీటీడీ ఆలయాల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి శ్రీలక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలోని శ్రీ పెరియాళ్వార్వారి సన్నిధిలో ప్రబంధ పాశురాలను నివేదిస్తారు. చివరి రోజైన జూలై 05వ తేదీ ఉదయం శ్రీ పెరియాళ్వార్కు తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీగోవిందరాజస్వామివారు గరుడ వాహనంపై, శ్రీ పెరియాళ్వార్ గజ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. శ్రీ మహావిష్ణువుకు పెరియాళ్వార్ పరమభక్తుడు. శ్రీ ఆండాళ్ అమ్మవారికి ఈయన తండ్రి. శ్రీ పెరియాళ్వార్ తులసిమాలలు కట్టి ప్రతిరోజు స్వామివారికి సమర్పించేవారు. తండ్రితో పాటు ఆరాధించిన ఆండాళ్ అమ్మవారు చివరకు స్వామివారినే భర్తగా భావించారు. శ్రీ పెరియాళ్వార్ ఎన్నో పాశురాలను రచించి స్వామివారికి అర్పించారు. ఈయనకు శ్రీమహావిష్ణువు సాక్షాత్కారం జరిగినట్టు అర్చకులు తెలిపారు.

# చంద్రగిరి మార్గంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- **15 ఎర్రచందనం దుంగలతో పాటు కారు స్వాధీనం**
- **కారులో అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నటాస్క్ ఫోర్స్**

తిరుపతి,జూన్ 23,మనం న్యూస్ః చంద్రగిరి-శ్రీవారిమెట్టు మార్గంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి 15 ఎర్రచందనం దుంగలు, రవాణా చేస్తున్న కారును టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ గారి అధ్వర్యంలో డీఎస్పీ జె. బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ సి. వినోద్ కుమార్ టీమ్ ఆదివారం రాత్రి భాకరాపేట రేంజిలోని నాగపట్ల అటవీ పరిధిలోని శ్రీవారిమెట్టు నుంచి చంద్రగిరి వెళ్లే మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున వేగంగా వచ్చిన ఒక కారు పోలీసులను చూసి ఆగిపోయింది.




ఇంకా అందులోని వ్యక్తులు కారు దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసులు స్పందించి, వారిని చుట్టుముట్టారు. కారులో చూడగా 15 ఎర్రచందనం దుంగలు కనిపించాయి. పట్టుబడిన వారిని తమిళనాడు వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులపై సమీక్ష

**తిరుమల, జూన్ 23,మనం న్యూస్ :** తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.చీఫ్ మ్యూజియం ఆఫీసర్ (ఇన్చార్జ్) సోమన్ నారాయణ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అదనపు ఈవో కు మ్యూజియంలో ప్రస్తుత అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఈఓ మాట్లాడుతూ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి వస్తు ప్రదర్శనశాలగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.



భద్రతా పరంగా తీదుకోవలసిన సమగ్ర చర్యలు, ఆధునిక సాంకేతికత ఆధారంగా సీసీ కెమెరాలు, హెడ్ కౌంట్ సెన్సార్లు, గార్డులు, గైడులు, తదితరాలను ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. మ్యూజియం ప్రాంగణంలో అభిప్రాయ సేకరణ కోసం ఫీడ్బ్యాక్ కియోస్కు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన మ్యూజియం తెరిచే సమయం, టికెట్ ధర, కళాఖండాల సంరక్షణ గది, అధికారిక సెల్ఫీ పాయింట్ తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. నిర్మాణ దశలో ఉన్న అన్ని పనులను నిర్దేశించిన సమయం లో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో టీటీడీ సీఈ సత్య నారాయణ, ట్రాన్స్పోర్ట్ జీఎం శేషారెడ్డి, ఈఈలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, మనోహర్, డీఈ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, వీజీఓ సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డా మధుసూదన్, మ్యూజియం క్యూరేటర్ శివకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నతుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి




**తిరుపతి,జూన్ 23,మనం న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిలో సంక్షేమం, అభివృద్ధి పై సమీక్ష, కూటమి ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణను పై అమరావతిలో ఏర్పాటు చేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రతి నియోజకవర్గంలో నుంచి ముఖ్యమైన ప్రజా ప్రతినిధితో పాటు అధికార యంత్రాంగం పాల్గొంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏడాది పాలనలో తీసుకొచ్చిన అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాల అమలు, స్వర్ణాంధ్ర విజన్ 2047ను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చెప్పిన విషయాలను పూర్తిగా అవగతం చేసుకున్నామన్నారు.

## సినిమా పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

- **చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణా రెడ్డి**

**చేవెళ్ల, జూన్ 23(మనం న్యూస్) :** తెలంగాణలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని మాజీ జెడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి అన్నారు.నగరం లోని ప్రసాద్ థియేటర్ లో ఎస్ ఎస్ మీడియా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమం నిర్వహించారు. పరమ పద శోపానం సినిమా టీజర్ రిలీజ్ కార్యక్రమంకు చేవెళ్ల మాజీ జడ్పిటిసి మాలతి కృష్ణా రెడ్డి ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడారు . తెలంగాణ లో సినిమా



పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడానికి రేవంత్ సర్కార్ ముందుకు వెళ్ళుతుందన్నారు. ఈ సినిమా ను జులై 11 న రిలీజ్ చేయనున్నారనీ తెలిపారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమంలో సినీ నిర్మాత సి.కళ్యాణ్ ,హీరో అర్జున్, హీరోయిన్ జెన్ని పర్, ప్రొడ్యూసర్ గుడి మెట్ల శివ ప్రసాద్, డైరెక్టర్ నాగ శివ, మ్యూజిక్ డైరెక్టర్ డేవిడ్, ఆర్టిస్ట్ లు బిళ్ల ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ పోలీస్ స్టిక్కర్ వాహనాలపై స్పెషల్ డ్రైవ్

- **సంబంధంలేని వారు స్టిక్కర్లు వినియోగిస్తే చర్యలు**
- **అనధికారికంగా సైరన్లు వినియోగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం**
- **చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు**

**చిత్తూరు,జూన్ 23,మనం న్యూస్ :** చిత్తూరు జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ మధ్య కాలంలో కొంత మంది ప్రెస్, పోలీస్ విధులతో సంబంధం లేనివారు



కూడా వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోని తిరుగుతున్నారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే, కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వాహనాలను తనిఖీలలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# జూలై 06 నుండి 09వ తేదీ వరకు శ్రీ కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు



**తిరుపతి,జూన్ 23,మనం న్యూస్ :** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 06 నుండి 09వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం జూలై 06న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జూలై 07న మొదటిరోజు ఉదయం ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహిస్తారు. జూలై 08న రెండో రోజు ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజ, హోమం చేపడతారు.

జూలై 09న ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన శ్రీ కపిలేశ్వరస్వామి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ చండికేశ్వరస్వామివార్లు పుర వీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు....

## న్యాయమూర్తిగా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

**చేవెళ్ల, జూన్ 23(మనం న్యూస్) :** స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా విజయ్ కుమార్ ఉపాధ్యాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అచ్చంపేట నుండి చేవెళ్ల జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల భారసోసియేషన్ సభ్యులు ఉన్నారు.



## సమాచార శాఖ డీఐపిఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.పురుషోత్తం

**నంద్యాల,జూన్ 23,మనం న్యూస్ :** సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీఐపిఆర్వో)గా సిహెచ్. పురుషోత్తం సోమవారం పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో డిపిఆర్ఓ గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం సాధారణ బదలీపై నంద్యాల జిల్లాకు రావడం



జరిగిందన్నారు. ఈ జిల్లాలో డీఐపిఆర్వోగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సలహాలు, సూచనలు పాటిస్తూ.. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లా అభివృద్ధిలో తమవంతు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన డీఐపిఆర్వోకు అభినందనలు తెలియజేశారు.

## ఆమె వదిలిన అడుగుల వెంట...

గడియ తీసే ఉంచా...
ఏదో వేలనైనా తానొస్తుందనే వెర్రినమ్మకం
ఏవేవో ఊహలు
హృదయాన్నుండి మెదడుకు
మెదడు నుండి హృదయానికి
ప్రసారమవుతున్నపుడూ
ఏ కంటికి సోకకుండా...
గాలికైనా తానొచ్చే తోవ తెలియకుండా
వచ్చింది గదిలోకి
వస్తూ...వస్తూ...
ఏ హిమానీ నదులలో తానమాడి వచ్చిందో
మెల్లగా నా మేనిని సుతారంగా తడిమితే
ఆ స్పర్శకి ఆయాచితంగా లేసిన నా తలను
చల్లని తన ఒడిలోకి మెల్లగా తీసుకుంది
ఏయే పూల గంధాల వనముల గుండా వచ్చిందో
నా చుట్టూ అలుముకున్న పరిమళాలకు
మనసు మగతగా ఊహల ఊయలలూగుతుంది
తనువు ఆమె ఒడి ఊయలలో సేద తీరుతుంది
చీకట్లను చీల్చుతూ వెలిగేటి
ఆ దివ్వె తేజపు ముఖంలో ముఖంపెట్టి
చూస్తున్నపుడు
దొంగ మోహంది ఏ మంత్రమేసిందో ...
మత్తుగా ఆదమరిచి నిదురలోకి జారుకున్నా...
వేకువనే గోలచేసే కోడికూతలకు
చిరాకుగా నిదురకల్లను నలుస్తూ తెరిచి చూస్తే...
చుట్టూ ఆవరించిన శూన్యం
తానొదిలెళ్లిన హాయిని దోచేందుకు బయలెల్లిన
అఘాంతకుడు
గాభరాగా గది బయటకురికి చూస్తే...
తెల్లగా కరుగుతున్న తన పాదముద్రలు
ఆమె వదిలిన అడుగుల వెంట సాగుతున్న
చూపులు
అనంతానంత దూరాలలో మాయమవుతున్న
తనవైపు
ఆశగా సాగుతున్న పయనం...

**- దిలీప్. వి**
8464030808

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# తెలంగాణ అస్తిత్వ పతాక జయశంకర్



అణచివేతకు గురైన ఆకాంక్షలకు ప్రతిరూపం అతడు. కన్నీళ్ళను, కష్టాలను, కడుపులో దాచుకుని తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశగా, ఆశయంగా, లక్ష్యంగా, జీవితంగా బతికి, భావజాల వ్యాప్తి చేసిన దార్శనికుడు. తెలంగాణ సాధనకు జెండాలు లేవు, ఎజెండాలు మాత్రమే అని చెప్పి ప్రతి పార్టీ ఇంటి గడప తొక్కి, బొట్టుపెట్టి, మరీ బతిమాలిన వ్యక్తి. తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని ఖండాంతరాలలో వినిపించిన మనసున్న మంచిమనీషి. నాలుగున్నర కోట్ల గొంతుల ఉద్యమ నినాదం అతడు.

తల్లిదండ్రులు, ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క, చెల్లెళ్ళు, ఉన్నటువంటి ఒక వ్యక్తి పెళ్లి చేసుకోకుండా ఒక అనాధను చేరదీసి, విద్యాబుద్ధులు చెప్పించి, ప్రయోజకుల్ని చేసి మరొక అనాధ అమ్మాయిని పెళ్లి చేసి వారిద్దరికీ పుట్టిన బిడ్డను ఎత్తుకుని ఆడించి ఆనందపడిన అరుదైన సంఘటనను కేవలం ఒక జయశంకర్ సార్ విషయంలో మాత్రమే చూడవచ్చు. అది అతనికి ఉన్నటువంటి నిబద్ధత, మానవీయత.

అధిక సంఖ్యాకుల క్రౌర్యం నుండి అల్పసంఖ్యాకులను కాపాడాలనే అంబేద్కర్ వాదాన్ని శిరసావహించాలని చెప్పిన నికార్సయిన ప్రజాస్వామ్యవాది అతడు. అడుక్కోని అయినా తింటం కానీ ఆంధ్రోళ్లతో కలిసి ఉండం అని ఫజల్ అలీ కమిషన్ కు బరాబర్ తెగేసి చెప్పిన నిక్సాన తెలంగాణ మట్టిమనిషి... ఢిల్లీ నుంచి గల్లీ వరకు సమావేశం, సభ, ధర్నా, రస్తా రోకో, ఏం జరిగినా తాను మాట్లాడేది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం గురించి మాత్రమే.

పలుచనైన తెలంగాణ ఉద్యమంను చిక్కపరిచిన వ్యక్తి అతడు. జీవితాంతం బ్రహ్మచారిగానే బ్రతికిన ఆ మహోద్యమ కెరటం పేరు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. సార్ అనే పదం లేకుండా జయశంకర్ సార్ ను పిలవలేం. అది ఆయనకు తెలంగాణ సమాజం ఇచ్చే గౌరవం, ఆ హోదాను విడదీసి చూడలేము. జయశంకర్ గారిని అలా పిలవడం వలన సార్ 'అనే పదానికే ఔన్నత్యం పెరిగింది అని చెప్పాలి. కన్నుల్లో ఆవేశము ఉన్నా, నా గుండెల్లో బాధ ఉన్నా, ఆధిపత్య శక్తులను ఎదుర్కోవాలంటే అవన్నీ మర్చిపోయి రాజ్యాంగబద్ధంగా మనకు రావాల్సిన నీళ్లు నిధులు తెచ్చుకోవాలని చెప్పి మనసా, వాచా, కర్మణా ఆచరించి నిబద్ధత చూపిన , తెలంగాణ అస్తిత్వ పతాక ఆచార్య జయశంకర్.

1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో లక్ష్మి కాంతారావు, మహాలక్ష్మీ దంపతులకు జన్మించాడు జయశంకర్. ఉర్దూ మీడియంలో ఉన్న హనుమకొండలోని మర్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య, హన్మకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక విద్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎస్.సి. వరకు చదువుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ పూర్తి చేశాడు. ఎం.ఎ.తో పాటు ఎకనామిక్స్లో పిహెచ్డ్ కూడా పూర్తి చేశాడు. సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

వరంగల్‌లో డిగ్రీ కాలేజీ లేదు అని ధర్నాలు చేసి, ఉద్యమించిన విద్యార్థుల మొదటి వరుసలో ఉన్న జయశంకర్ పొరపాటున వరంగల్‌కు డిగ్రీ కాలేజ్ అని కాకుండా యూనివర్సిటీ కావాలని నినదించారు. అది పొరపాటు కాదని ఆ తర్వాతి కాలంలో రుజువైంద అని చెప్పవచ్చు 1952లో తెలంగాణ ఉద్యమంలో ఇంటర్మీడియట్ దశలోనే 'జై తెలంగాణ' నినాదం చేసి తరగతి గది నుండి బహిష్కరింపపడ్డాడు. అప్పటి నుండి తాను మరణించే వరకు తెలంగాణ పదాన్ని వీడి ఎన్నడూ లేదు.

నాన్ ముల్కీ గోబ్యాక్ నినాదాలతో హైదరాబాద్‌లో జరిగిన మీటింగ్ లో పాల్గొనడానికి బయలుదేరిన బస్సు ఫెయిల్ అయిన కారణంగా పోలీసు కాల్పుల్లో నుండి తప్పించుకున్నట్టు అయ్యింది. జయ శంకర్ సార్ మిత్రులు ఆ రోజు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. ఇన్ని ఘోరాలు చూడడానికే నా ఇంకా బ్రతికి ఉన్నాను, ఆ కాల్పుల్లో చనిపోయే అదృష్టం నాకు దక్కక పొయ్యే అని ఎన్నోమీటింగ్ లో ప్రత్యక్షంగా బాధపడిన సందర్భాలు ఉన్నాయి.

తౌరక్యాంధ్రమనీ తురకల భాష అని ఎగతాళి చేసిన అయ్యదేవర కాళేశ్వరరావు మీటింగ్‌ను బహిష్కరించాలని పిలుపునిచ్చి లాఠీ దెబ్బలు తిన్నారు. జంధ్యాల పాపయ్య శాస్త్రి, శ్రీశ్రీ వంటి వారి కవిత్వంలో ఉర్దూ పదాలను చూపి వారి కళ్ళు తెరి పించిన సాహిత్య అభిమాని జయశంకర్ సార్. తెలంగాణ చరిత్రను ఊహించని రీతిలో పూర్తి వివరాలు సేకరించి విశ్లేషణలతో ముందుంచి అన్ని రాజకీయ పార్టీలకు తెలంగాణ ఆవశ్యకత గురించి వివరించారు.

తెలంగాణ విశాలాంధ్ర అయిన తర్వాత దాశరథిని, ఎన్టీఆర్ గారు ఏపీ ఆస్థానకవి నుండి తొలగించి చాలా తప్పు చేసి పరోక్షంగా ఆయనను మానసిక క్షోభకు గురి చేశాడని ఎన్నో వేదికలమీద ప్రసంగించారు. రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలకు రావాల్సిన నీటి వాటాను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాల్సిందేనని, తెలంగాణకు వచ్చే ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని కృష్ణా బోర్డుకు ఆనాడే చెప్పారు. ఆచార్య జయశంకర్, స్టూడెంట్ గా ఉన్నపుడు 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' అన్నారు. ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు 'నాన్ ముల్కీ గోబ్యాక్' అన్నారు. లెక్చరర్ గా ఉన్నప్పుడు 'వలసాంధ్ర పెత్తనం గోబ్యాక్' అన్నారు. ప్రొఫెసర్ గా ఉన్నప్పుడు 'ఆత్మగౌరవం కావాలన్నారు'. విసిగా ఉన్నప్పుడు. 'అన్న దమ్ముల్లా విడిపోదాం' అన్నారు. పొట్టకూటి కోసం వచ్చిన వాళ్ళతో కొట్లాట లేదని, పొట్ట కొట్టడానికి వచ్చిన వాళ్ళ మీదనే పంచాయతీ అని కుండబద్దలు కొట్టి చెప్పారు.

1969లో ఉవ్వెత్తున ఎగిసి పడ్డ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉప్పొంగిన ఉడుకు రక్తం తో యువతరం ఉద్యమకారుడిగా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపాడు జయశంకర్ సార్. తెలంగాణ సాధన మొత్తం ప్రజాస్వామ్య యుతంగా రాజ్యాంగానికి లోబడే జరగాలని ఏ విధమైన హింస చోటు చేసుకోవద్దు అని గట్టిగా నమ్మిన వ్యక్తి జయశంకర్ సార్. మొదటిది భావజాల వ్యాప్తి రెండోది ఆందోళన కార్యక్రమం. ఇవి ఉన్నప్పుడే ఖచ్చితంగా మనం కన్న కలల్ని సాకారం చేసుకోగలుగుతాము అని నమ్మేవారు జయశంకర్ సార్..

1960లో ఉపాధ్యాయుడిగా, లెక్చరర్‌గా,1975-79వరకు, సీకేఎం కాలేజీలో ప్రిన్సిపల్‌గా 1982-91 వరకు ఇఫ్లు రిజిస్ట్రార్‌గా,91-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వి.సి గా ఎన్నో పదవులనుఅలంకరించినాఎప్పుడు తనకు కేటాయించిన గదిలో ఉండి తానే వంట చేసుకుని తిని సాధారణ జీవితం గడిపిన అసాధారణమైన మహా మేధావి జయశంకర్ సార్. తెలంగాణ కోసం టీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ఎస్ వరకు ఎవరితోనైనా కలిసి పని చేయడానికి సిద్ధం అని చెప్పి ఎవరు మీటింగ్ పెట్టిగా వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పేవారు.

జయశంకర్ సార్ రచనలు చూస్తే ఆ హెడ్డింగ్ లోనే, తెలంగాణ ఆకాంక్ష ఎంత బలంగా ఉందో తెలుస్తుంది. 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్', 'తెలంగాణలో ఏం జరుగుతోంది', 'వక్రీకరణలు - వాస్తవాలు','తల్లడిల్లుతున్న తెలంగాణ', ' తెలంగాణ (ఇంగ్లీష్ పుస్తకం)'

మిలియన్ మార్చ్ జరిగిన విగ్రహాల విధ్వంసాన్ని ఆయన సమర్థించారు. తెలంగాణ కవులు, నాయకుల విగ్రహాలు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. 2009లో కేసీఆర్ ఆమరణ దీక్షకు వచ్చిన తెలంగాణ ప్రకటనను నాటి హోం మంత్రి చిదంబరంకు ప్రత్యక్షంగా మాట్లాడి అనౌన్స్ మెంట్ ఏవిధంగా తప్పులేకుండా, పొరపాటు జరగకుండా చెప్పాలో రాసి ఇచ్చింది. జయ శంకర్ సార్ అనే విషయం ఎంత మందికి తెలుసు. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో, ప్రధాని మన్మోహన్ సింగ్ గారితో, ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీగారితో, హోం మంత్రి చిదంబరంతో ప్రత్యక్ష చర్చలు జరిపిన ఒకే ఒక వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్.

'పుట్టుక నీది చావు నీది బతుకుతా తెలంగాణది' అని తెలంగాణ కోసం అహర్నిశలు పరితపించిన జయశంకర్ సార్ తెలంగాణ ఏర్పాటు జరగక ముందే 21 జూన్ 2011న క్యాన్సర్‌తో ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు. తను లేకపోయినా తను కలలుగన్న సామాజిక , ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటు జరిగితేనే జయశంకర్ సార్ ఆత్మ శాంతిస్తుంది.



**- డా. మెంతబోయిన సైదులు**
90 109 10956

# గిజూబాయ్ జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శం



'ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి?' అనే దానిని ఉపాధ్యాయ లోకానికి వివరించిన గిజూబాయ్ జీవితం ఎందరికో ఆదర్శం.

విద్యారంగంలో అత్యంత ప్రధానమైన మూడు ప్రశ్నలు వున్నాయి. అవి ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి? ఈ మూడు ప్రశ్నల పరిష్కారం పైనే విద్య ప్రయోజకత్వం ఆధారపడి వుంది. విద్యకు సంబంధించిన ఏ ప్రణాళికలోనైనా, ఏ పద్ధతిలోనైనా ఈ మూడు అంశాలు తప్పకుండా గమనింపబడాలి. ఈ మూడింటిని చర్చగా సమన్వయ పరచినపుడే ఫలితాలు మంచివిగా మనకంద గలవు. ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఈ రెండూ వ్యక్తి అవసరాలు, సమాజ అవసరాలు, దేశ అవసరాలపై ఆధారపడి వుంటాయి. ఈ అవసరాలు కూడా తాత్కాలికమైనవిగాను, శాశ్వత మైనవిగాను రెండు రకాలుగా వుంటాయి. అందువల్ల మనం నేర్పించదలచుకున్న దాని పద్ధతి మారుతూ వుంటుంది. ఈ కారణం చేతే విద్యా ప్రణాళిక కూడా ఎల్లప్పుడూ మారుతూనే వుంటుంది. అలాగే విద్య నియమని బంధనలు కూడా, పద్ధతులు కూడా, ఫలితాలు కూడా నిర్ధారించటానికి విద్యావేత్తలు, మేధావులు నిరంతరం ప్రయత్నిస్తూ వుంటారు.ఇలాంటి భావాలకు మొదట రూపకల్పన చేసినవారు 'గిజూబాయి గారు'.

నవంబర్ 15,1885 న జన్మించి తన జీవితాన్ని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా తన అనుభవాలను ఉపయోగించి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎన్నో అమూల్య సూచనలు, సలహాలతో భారతీయ విద్యావిధానంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాల్ని తెలుపుతూ ప్రత్యేకంగా వసతిని ఏర్పాటు చేసి వాటిని అమలు చేసి ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు గిజుబాయి. ఎన్నో సముచిత మార్గాలను ఉపాధ్యాయులకు సూచించి జూన్ 23,1939న తనువు చాలించిన మహాజ్ఞాని గిజుబాయ్.

సులభమైన భాషలో యథార్థ విద్యాపరిస్థితులను విశ్లేషించడంలో గిజూభాయి సాటి ఎవరూ లేరు. ఆయన ఉపాధ్యాయుల పరిమితులను, ఇబ్బందులను కూడా బాగా అర్థం చేసుకున్న వారు. ఉపాధ్యాయులను బంధించి వుంచిన ఈ వ్యవస్థ కూరత్వం కూడా ఆయనకు బాగా తెలుసు. 'స్కూలు అనే ఎడారిలో పిల్లలు పడే బాధలు' ఆయన చూడలేక పోయారు. వారి బాధల నివారణకే ఆయన విద్యారంగంలో కొత్త కొత్త ప్రయోగాలు ఆవిష్కరించారు.

పిల్లల వికాసాన్ని దగ్గరగా వుండి చూడడానికి, సూక్ష్మంగా ఆలోచించడానికి తాను అనుకున్న విద్యా విలువలు నిరూపించటానికి ఆయన భావనగర్‌లో ఒక ప్రయోగశాల రూపంలో 'దక్షిణామూర్తి బాలమందిరం' స్థాపించారు. పిల్లల అవసరాలు, పిల్లల అభిరుచులు, పిల్లల శక్తిసామర్థ్యాలు మున్నగువాటిని గమనంలో వుంచుకుని ఆయన అక్కడ అనేక ప్రయోగాలు చేశారు. తదనంతరం వాటినన్నింటి సారాన్ని 'నూతన శిక్షణ' రూపంలో గిజూభాయి మనకు అందించారు. క్రొత్త దృక్పథం, క్రొత్త చైతన్యం, క్రొత్త జాగృతికి చిహ్నమైన గిజుభయ్ జీవితం అందరికీ ఆదర్శం. పుట్టినప్పటి నుండి పిల్లలు తమ తల్లిదండ్రుల నుంచి, తమ కుటుంబం నుంచి వారు పడే కష్టాలు, పొందే వేదనలు, బాధలు, దుఃఖాలు ఇన్నీ అన్నీ కావు. పిల్లలు ఎలాంటి నేరగాళ్ళు కారు వారు అత్యంత అమాయకులు అయినప్పటికీ మనం మన అజ్ఞానంచేత, తెలివిలేని తనం చేత, మనకు సాధారణంగా వున్న బలహీనతల చేత, మన పిల్లలనే రాత్రింబవళ్ళు వేధిస్తూవుంటాము.మాటి మాటికీ అవమానిస్తూ, కొడుతూ, తిడుతూ వారి జీవితాన్ని నరకప్రాయం చేస్తూవుంటాము. ఒక్కసారి ఆలోచిద్దాం... మన పిల్లలను మనము చీటికీ మాటికీ తిడుతున్నామా లేదా? కొడుతున్నామా లేదా? చెప్పిన మాట వినలేదని దండిస్తున్నామా లేదా? మరీ మనకు కోపము హెచ్చితే ఇంటి నుంచి వారిని తరిమిగొడుతున్నామా లేదా? వీటికి ఏమైనా హద్దూ పద్దూ ఉందా? సాధారణంగా మన ఇళ్ళల్లో పెద్దవాళ్ళమైన మన చేతులే పైన ఉంటాయి. కానీ పాపం పిల్లలు బిక్కు బిక్కుమని అమాయక చూపులతో ఇంటిలోని ఒక మూలలో ఒదిగి పడిఉంటారు.ఇలాంటి కుటుంబాలు కోకొల్లలు.ఇది నాటి కాలపు పరిస్థితి కానీ నేడు మార్పు జరిగింది. అప్పటి ఆలోచన విధానంపై ఆనాటి రచనలు కొనసాగాయి.



అలాంటి అసంఖ్యాకమైన పిల్లలను రక్షించడానికి అన్నట్లు ఆవిర్భవించిన గుజరాతీ మహోపాధ్యాయుడు 'గిజూభాయి బధేకా'. గుజరాత్ లో పిల్లల మనోహరమైన శిక్షణా సంస్థ స్థాపించి మాంటిసోరీ పద్ధతిలో నవీన బోధనకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు గిజుబాయ్.

తల్లిదండ్రులకు, నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సుమారు 17 ఉత్తమ పుస్తకాలను రచించారు. వీటిలో బాల మనస్తత్వ శాస్త్రం, వారి పెంపకం, వారి శిక్షణ, ప్రేమపూర్వకంగా వాత్సల్యంతో నిండి ఎలా చేయాలో మనకు ప్రబో,ధించారు.

ఈ పుస్తకాలన్నిం టినీ తెలుగు ప్రజలకు, ఉపాధ్యాయులకు అందడం కొరకు తర్జుమా చేసి 7 సంపుటాలుగా రూపొందించి 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పాఠశాలకు ఉపాధ్యాయుల కొరకు పంపిణీ చేశారు. రాజల్ దేసర్ (రాజస్థాన్)లోని మాంటిసోరి బాల శిక్షణా సమితి హిందీలో ప్రచురించిన 17 భాగాల సంకలనంను పాఠకుల సౌలభ్యం కోసం వాటిని 7 సంపుటాలుగా ప్రచురించడం జరిగింది.

గిజూబాయి రచించిన పుస్తకాలలో తల్లితండ్రులకు, తల్లితండ్రుల ప్రశ్నలు, తల్లితండ్రులు కావడం కఠినం, తల్లితండ్రుల తల నొప్పి, ప్రాథమిక పాఠశాలలో భాషా శిక్షణ,ఉపాధ్యాయులు అయినప్పుడు శిక్షణ.. నా భావనలు, ప్రాథమిక పాఠశాలల్లో బోధనా పద్ధతులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో లేఖావాడనం,మాంటిసోరి పద్ధతి-భాగం-1, మాంటిసోరి పద్ధతి - భాగం-2, ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-1, ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-2,కథా బోధనా పద్ధతి,అడుతూ.. పాడుతూ అనేవి ముఖ్యమైనవి.

పుస్తకాలలో 'మాంటిసోరి పద్ధతి', 'పగటికల', 'కథా బోధనా పద్ధతి' అత్యంత విలక్షణమైనవి.విద్యారంగంలో ఈ మూడు పుస్తకాలు చాలా మౌలికమైనవని భావింపబడుతాయి. ఇవి గిజూభాయి విద్యారంగానికి ఇచ్చిన కానుకలుగా గుర్తించబడినది. వీటిలో గిజూభాయి తన మేధస్సును, మనస్సును పూర్తిగా మేళవింపుచేసి రాయడం వల్ల వీటిని చదివిన వారు బాలల శిక్షణను పూర్తిగా అర్థం చేసుకొని వాటిలోని అర్థాన్ని గ్రహించగలిగే ఎన్నోఅంశాలు నిండివున్నాయి. ఇవి బాలల జీవితాలను లోతుగా అధ్యయనం చేయడానికి ఎంతగానో దోహదపడు చున్నాయి.

ఈ పుస్తకాలు దేశములోని ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు తమ బాలలకు సంబంధించిన పరిజ్ఞానాన్నీ, శిక్షణా పద్ధతులను సమగ్రంగా అందిస్తాయని, కనుక వీటిని చదివి ,ఆచరణలో పెట్టడం వల్ల తమ పిల్లలను మంచి పద్ధతిలో పెంచుతారని గిజూభాయి ఆశించారు.

మన దేశంలో 'గిజూభాయి ఐరేకా' బాలల శిక్షణ కొరకు ఒక ఆందోళన ప్రారంభించారు. విద్య అంటే ఆయన దృష్టిలో ఎంతో విస్తృతమైన అర్థం కలిగి, దాన నిర్మాణం, రచన, వ్యవస్థ, సాధన, సంస్కారం మొదలగు ఎన్నో అర్థాలనిచ్చి వ్యక్తి వికాసం పెంపొందించుకుని, అలాగే ఒక వ్యక్తిత్వాన్ని రూపుదిద్దటానికి కూడా అతనిని ఎంతో సంస్కారవంతుడిగా మార్చాల్సి రావడం, అతడి వ్యక్తిత్వం అందంగా, తేజోవంతంగా, మారడమే విద్య అని భావించిన మేధావి

**గిజూభాయి ఐరేకా**

ఇళ్ళల్లో తల్లి తన పిల్లవాడితో ఎక్కువ సమయం గడుపుతుంది. అందువల్ల ఆమే వాడికి అత్యంత సన్నిహితురాలు. తన బిడ్డను అర్థం చేసుకోవడానికి ఓర్పు, నేర్పు, శక్తి సామర్థ్యాలు తల్లిలోనే ఎక్కువగా వుంటాయి. స్వర్గీయ గిజూభాయి గారు కూడా తల్లి లాంటి సూక్ష్మ దృష్టితో, మమత నిండిన కళ్ళతో పిల్లలను చూచారు. వారి వ్యక్తిత్వాన్ని జాగ్రత్తగా వికసింపజేసే ప్రయత్నం చేశారు.

గిజూభాయి రచనలన్నీ అన్ని దేశ భాషలలోనూ రావలసి వుంది. ఆ రచనలు మన దేశ బాలల శిక్షణకు దిశానిర్దేశం చేసేవి. విద్యకు సంబంధించిన సిద్ధాంతాలను, బోధనా పద్ధతులను అర్థం చేసుకోవాలంటే ఆ రచనలు చదవడం అత్యావసరం. ఇంత కాలం తర్వాత కూడా ఆ పుస్తకాలు ఇందువల్లే ఉపయోగకరంగానూ, సందర్భోచితంగాను వున్నాయి. ఎందుకంటే అవన్నీ ఒక అనుభవం నిండిన ఉపాధ్యాయుడి అనుభవాల నుంచి వెలువడ్డాయి. ఆ కాలం నాటి జాతీయ నేపథ్యంలో, మానవత్వ నేపథ్యంలో ఆ రచనలు చేయబడ్డాయి.

కావునా వారి జీవితాన్ని,వారి రచనలు చదివి విద్యార్థితో ఎలా మసలుకోవాలో తెలుసుకొని చిన్నారులను ప్రేమతో చూసుకొని వారిని ఉత్తములుగా తయారు చేస్తారని ఆశిద్దాం.

**- గడప రఘుపతిరావు**
9963499282

# ప్రత్యేక ఉపాధ్యాయులకు భరోసా ఏది?



ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ప్రభుత్వం నిబద్ధత ప్రశంసనీయమే... కానీ ప్రత్యేక ఉపాధ్యాయుల విధులకు స్పష్టత ఇవ్వడం అత్యవసరం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యను ప్రోత్సహించే దిశగా 2024లో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నూతన విద్యావిధానం 2020 ప్రకారం, సాధారణ పాఠశాల వాతావరణంలోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యనభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంలో



తెలంగాణ ప్రభుత్వమే ఒక ముందడుగు వేసి, ఉపాధ్యాయుల నియామకం చేయడం అభినందనీయమైనది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అందరూ పిల్లలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రత్యేక విద్య ఉపాధ్యాయులను నియమించడం జరిగిం ది. ఇది విద్యలో సమానత్వం అనే మహత్తర ఆలోచనలకు పునాది వేసింది. అయితే, ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల విధులు, బాధ్యతలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ప్రభుత్వం విడుదల చేయలేదు. దాని ఫలితంగా చాలామంది ప్రత్యేక ఉపాధ్యాయులు తాము ఏమి చేయాలో, ఏ శాఖకు బాధ్యత వహించాలో తెలియక, అనిశ్చితిలో ఉన్నారు. కొన్నిచోట్ల అయితే ప్రత్యేక విద్యకు సంబంధంలేని ఇతర పనులను అప్పగిస్తూ అసలు ఉద్దేశ్యాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం మంచి ఆరంభం చేసింది. కానీ ఆ ప్రయోజనం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పూర్తిస్థాయిలో విద్యా నైపుణ్యాలు పేరుగాలంటే, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరాలంటే ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల విధులను స్పష్టంగా పేర్కొంటూ ఉత్తర్వులు తక్షణం ఇవ్వాలి. విద్యా రంగంలో ముఖ్యంగా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అభివృద్ధికి ఇది అత్యవసరం.

తెలంగాణ ప్రభుత్వం చేసిన మంచి ఆరంభానికి కొనసాగింపుగా స్పష్టత మరియు కార్యాచరణే ముఖ్యం.

ప్రత్యేక విద్య ఉపాధ్యా యులకు సంబంధించిన విధులపై తక్షణ ఉత్తర్వులు విడుదల చేసి, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తుకు వెలుగునివ్వాలి. ఇది కేవలం ఉద్యోగ పరిరక్షణ విషయమే కాకుండా, సమాజ సమగ్ర అభివృద్ధి దిశగా ముందడుగు కూడా అవుతుంది.

ప్రత్యేక ఉపాధ్యాయుల విధి స్పష్టత లేకపోవడం వల్ల ఎదురవుతున్న ప్రధాన సమస్యలు

**విధుల విషయంలో అనిశ్చితి:** ప్రత్యేక ఉపాధ్యాయులకు ఏ క్లాస్లను బోధించాలి? ఏ ఏ పిల్లలకు సపోర్ట్ ఇవ్వాలి? స్కూల్ రికార్డుల నిర్వహణలో ఎంతవరకు పాలుపంచుకోవాలి? వంటి మౌలిక అంశాలపై స్పష్టత లేకపోవడం వల్ల వారు స్కూల్స్ యందు సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**సంబంధంలేని పనుల భారం:** కొన్ని పాఠశాలల్లో వీరిని కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ కోసం వాడుతున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధంలేని డ్యూటీలు అప్పగిస్తూ వారి ప్రాథమిక విధిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

**పిల్లలకు నష్టమే ఎక్కువ:** స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ లు ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో పని చేయకుండా ఇతర పనుల్లో నిమగ్నమవడమే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నష్టంగా మారుతోంది.

**ప్రభుత్వం స్పందించాల్సిన అంశాలు:** విధులు, బాధ్యతలు, లక్ష్యాలు స్పష్టంగా పేర్కొన్న జాబ్ చార్ట్ తక్షణం విడుదల చేయాలి. ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను విస్తృతంగా రూపొందించి, వారిని విద్యా వ్యవస్థలో ప్రాధాన్యతతో, ప్రోత్సాహకం, ప్రత్యేక గుర్తింపు అందిస్తూ ప్రధాన భాగస్వాములుగా గుర్తించాలి. తెలంగాణ లో ఖాళీగా ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో తక్షణమే భర్తీ చేయాలి. సమగ్ర శిక్ష మరియు పాఠశాల విద్యాశాఖ మధ్య సమన్వయంతో జిల్లాలవారీగా ప్రత్యేక మానవ వనరుల ప్రణాళిక సిద్ధం చేయాలి. సాధారణ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల సహకారం తీసుకునే విధానం అభివృద్ధి చేయాలి.

ఇన్ క్లూజివ్ విద్యా విధానంలో కలిసి పని చేస్తేనే సత్ఫలితాలు వస్తాయి. పిల్లల అవస రాలకు అనుగుణంగా శిక్షణ, ఉపకరణాలు, మద్దతు వ్యవస్థ అందించాలి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసనకు తగ్గట్లుగా పాఠశాలల్లో స్వేచ్ఛా పూరిత వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే.

**సంఘటిత విధానంతోనే అభివృద్ధి:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలు దృష్టి, శ్రవణ, వృద్ధిమాంద్యం, ఆటిజం, బిహేవియరల్ డిసార్డర్లు, డిస్లెక్సియా వంటి విభిన్న సవాళ్లతో పోరాడుతున్నారు. వీరు సాధారణ తరగతులలో చేరి చదువుకునేందుకు ఒక సపోర్టివ్ సిస్టమ్ అత్యవసరం. ఈ అవసరాన్ని తీర్చే మొదటి మెట్టు ప్రత్యేక ఉపాధ్యాయుల స్పష్టమైన బాధ్యతల ప్రణాళిక. సామాజిక బాధ్యత,విద్యా విధాన విజయానికి మూలసూత్రం.

**- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# గ్లోబల్ జీనియస్ స్కూల్ ను సీజ్ చేయాలి



దేవనకొండ,జూన్ 23మనం న్యూస్ : మండల కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న గ్లోబల్ జీనియస్ స్కూల్ ను తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో ఆందోళన నిర్వహించి, అనంతరం ఎంఈఓ తిమ్మారెడ్డి గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న గ్లోబల్ జీనియస్ పాఠశాల ఎలాంటి ప్రభుత్వ అనుమతులు పొందకుండా నడుస్తుందని ఆరోపించారు. రంగురంగుల కరపత్రాలు, పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో ప్రచార ఆర్భాటాలు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆ మాటలు చెప్పి, ఇతర పెద్ద పెద్ద నగరాల నుంచి అనుభవజ్ఞుల చేత ఇద్దరు బోధిస్తున్నామని తల్లిదండ్రులకు ఎరా వేసి, అడ్మిషన్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మౌలిక సదుపాయాలు లేకుండా, రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తూ, పెట్రోల్ బంక్ కు కూత వేటు దూరంలోనే పాఠశాల నిర్మాణం చేపట్టి, విద్యార్థులను మరింత ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలు యాజమాన్యం చేస్తుందని ధ్వజమెత్తారు. బెంగళూరు బేస్ స్కూల్ సిస్టమని, ఎలాంటి అర్హతలేని టీచర్ల నియమించుకుంటూ, ఇన్స్పైరింగ్ ఫ్యాకల్టీ అంటూ, క్వాలిటీ ఎడ్యుకేషన్ అంటూ, అడ్వాన్స్ ప్లే మెథడ్స్ టీచింగ్ అంటూ అనేకంగా అసత్య ప్రచారాలను చేసి, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. మండలంలో ప్రవేట్ పాఠశాలలో అనేకంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా పాఠశాలలో నడుపుతున్నారని అన్నారు. అక్క బోనాలు లేకుండా రేకుల చెల్లెలు తరగతులు నిర్వహిస్తున్నారని, రవాణా బస్సులు మరియు ఇతర వాహనాలకు ఎలాంటి ఫిట్నెస్ లేకుండా వందలాది మంది విద్యార్థులను తిప్పుతున్నారని అన్నారు. ఫైర్ అనుమతులు లేకుండా చాలా ప్రైవేట్ విద్యా సంస్థలు నడుస్తున్నాయని అన్నారు. అవునా తక్షణమే జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ముందు ప్రత్యక్ష ఆందోళనలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మధు, నాయకులు రవి, జగన్, మబు,విష్ణు, భాస్కర్,మను,అఖిల్,రాజు తదతరులు పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ పోరాటానికి స్పందించిన ఎంఈఓ..**

గ్లోబల్ జీనియస్ పాఠశాల ముందు ఏఐఎస్ఎఫ్ చేసిన ఆందోళనకు ఎంఈఓ తిమ్మారెడ్డి స్పందించారు.పాఠశాలను సీజ్ చేస్తూ, నోటీసులు జారీచేసి, పాఠశాలకు అంటించారు. మండల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పొద్దని తెలిపారు.

## బసప్పకి ఘన సన్మానం చేసిన టీడీపీ నాయకులు



కౌతాళం, జూన్ 23 మనం న్యూస్: కౌతాళం మండలం తోవి గ్రామంలో ఎంపీపీ స్కూల్ నుండి వేరే గ్రామానికి బదిలీగా వెళ్తున్న హెడ్ మాస్టర్ కి,మరియు కొత్తగా జాయిన్ అయిన హెడ్ మాస్టర్ కి గ్రామ ప్రజలు, మరియు గ్రామ పెద్దలు సన్మాన కార్యక్రమౌ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు యువత నాయకులు చూడి సురేష్ నాయుడు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో సురేష్ నాయుడు మాట్లాడుతూ తొవి గ్రామంలో ఎటువంటి అభివృధి పనులకైన ముందుండి మా వంతు సహకారం ఎల్లపుడు ఉంటుందని అలాగే డిఎస్సీ ఫలితాలు వెలువడిన తర్వాత 5 మంది టీచర్స్ ను కూడా ఏర్పాటు చేస్తాము అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు,గ్రామ టీడీపీ నాయకులు శంకర్, సోమనాథ్,స్కూల్ చైర్మన్ లక్ష్మన్న,గణేష్, ఆంజనేయ, తలారి రామయ్య,దడిమి రమేష్,యువ నాయకులు విజయ్, బ్లడ్ బసవరాజు, కె.అంజి, జనసేన నాయకులు తిక్కయ్య,ఈరప్ప పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీడీవో గోపికృష్ణ



జూపాడుబంగ్లా, జూన్ 23 (మనం న్యూస్): జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ, తర్తూర్, మండ్లెం, జూపాడు బంగ్లా, తాటిపాడు, గ్రామాల సచివాలయాలలో విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు ప్రభుత్వం వారిచే నిర్వహించు ప్రత్యేక ఆధార్ క్యాంపులను విద్యార్థులు గ్రామ ప్రజలు వారి వారి ఆధార్ కార్డులలో మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని ఎంపీడీవో గోపికృష్ణ తెలియజేశారు. ఈ ఆధార్ క్యాంపు సేవలు జూన్ 24వ తారీఖు నుండి జూన్ 27వ తారీకు వరకు నిర్వహిస్తామని కింద కనపరిచిన విధంగా తంగడంచ, జూపాడుబంగ్లా 1, గ్రామలలో 24వ తేదీన మంగళవారము ఆ గ్రామాల సచివాలయాలలో ఆధార్ క్యాంప్ సేవలను కొనసాగిస్తారని, అదేవిధంగా తర్తుర్, జూపాడుబంగ్లా 2, 25 వ తేదీన బుధవారము, ఆధార్ క్యాంపు సేవలను కొనసాగిస్తారని, అదేవిధంగా, మండ్లెం, జూపాడుబంగ్లా 2, 26వ తేదీన గురువారం ఆధార్ క్యాంప్ సేవలను నిర్వహిస్తామని, అదేవిధంగా మండ్లెం, 2 తాటిపాడు, 27వ తారీఖున శుక్రవారం హాజరు క్యాంపస్ సేవలను నిర్వహిస్తామని, కావున సచివాలయాల పరిధిలోగల పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడి, మరియు వెలుగు పరిధిలో పెండింగ్ ఉన్నటువంటి మొత్తం ఆధార్ సర్వీసులు సరి చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్క సచివాలయంలోని ప్రజలు, పిల్లలు, వారి ఆధార్ కార్డుల జాబితాను సరి చేసుకోవలసినదిగా ఎంపీడీవో గోపికృష్ణ. తెలియజేశారు.

## పత్తి పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



- రైతు కడతట్ల శివ డిమాండ్

మంత్రాలయం , జూన్ 23, మనం న్యూస్: పత్తి పంట ను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రచ్చుమర్రి గ్రామ రైతు కడతట్ల శివ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ సూగురు గ్రామంలో తన పేరిట ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమి పొలంలో రెండు వారాల కింద రూ. 70 వేలు ఖర్చు చేసి పత్తి విత్తనాలు వేయడం జరిగిందని అయితే కల్లుదేవకుంట గ్రామానికి చెందిన రాముడు, ఈసప్ప, రంగన్న, కాశీం ,ఈరప్ప , ఆలూరు నరసప్ప ,కురువ సత్య, అనే వ్యక్తులు సోమవారం అక్రమంగా నా పొలంలో ఉన్న పత్తి పంటను దున్ని నాశనం చేశారని వారిపై తక్షణమమే చర్యలు తీసుకోవాలని స్తానిక5 పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేశానని బాధితుడు తెలిపారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్




మంత్రాలయం , జూన్ 23, మనం న్యూస్ :- అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తామస్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రాలయం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రాలయం మండలంలోని అనేక పాఠశాలలో అధిక ఫీజుల వసూలు చేస్తూ జీవో నెంబర్ 1 విద్య హక్కు చట్టాన్ని కాలరాస్తూ పాఠశాలలో పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అటువంటి పాఠశాలల పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు భవనాలు కాంపౌండ్ వాళ్ళు లేకపోయినా ప్రభుత్వం అనుమతులు ఎలా ఇస్తున్నారని అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వౌలిక సదుపాయాలు కల్పించేలా చూడలన్నారు. అనంతరం మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అరుణ ఆచారి , దివాకర్ ,భాష , వీరేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



- జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య

కర్నూలు, జూన్ 23(మనం న్యూస్): పిజిఆర్ఎస్ లో వచ్చిన ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాల పై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని బియాండ్ ఎస్ ఎల్ ఏ వెళ్లకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు చూడాలని ఎట్ టూ వ్యూ లో ఏ ఒక్క అర్జీ కూడా ఉండకూడదన్నారు.సిఎంఓ గ్రీవెన్స్ కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 7, కర్నూలు ఆర్డీఓ వద్ద 4, పత్తికొండ ఆర్డీఓ వద్ద 3, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడి , విద్య శాఖ, పశుసంవర్ధక శాఖ , డిఆర్డిఏ పిడి ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొండపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్‌కు ఘన సన్మానం



ఇబ్రహీంపట్నం, జూన్ 23 (మనం న్యూస్): ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొండపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ ను మైలవరం నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అభినందన సభను కొండపల్లిలోని వారి నివాసం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొని చుట్టుకుదురు శ్రీనివాస్ ను శాలువ కప్పి, పూలదండలు, బొకేలతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అభినందన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మెండెం జమలయ్య , కారుమంచి దుర్గారావు, మందా మురళీ, రెంటపల్లి శ్యామ్, దోప్పల బుజ్జిబాబు, నంబూరి శ్యామ్, రెంటపల్లి వెంకటేశ్వరరావు, కాకి నాగరాజు, కూరేటి చక్రవర్తి, దొబ్బల నాని, బల్లి డేవిడ్ రాజ్, అమృతలూరి ఆనంద్, పాకలపాటి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి




- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 అర్జీలు

కర్నూలు జూన్ 23మనం న్యూస్: ప్రజా ఫిర్యాదులు దృష్టికి రాగానే వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 29 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, ఎంఈ లీల ప్రసాద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ కు ఘన సన్మానం

తుగ్గలి జూన్ 23(మనం న్యూస్ ): తుగ్గలి మండల రెవెన్యూ కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ ఎస్.రవి, డిప్యూటీ తహశీల్దార్ ఎం. సుదర్శనం,సీనియర్ సంచాలకులు సుధాకర్ రెడ్డి లను సోమవారం మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలుమాలలతో సత్కరించారు.తహశీల్దార్ మాట్లాడుతూ చౌక దుకాణ డీలర్లకు ఏ సమస్య ఉన్న తమకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ల అసోసియేషన్ పగిడిరాయి సుంకన్న,ఉపాధ్యక్షులు గౌరన్న,మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్,డీలర్లు రామచంద్ర రెడ్డి,పురుషోత్తం చౌదరి,తిమ్మప్ప,ప్రతాప్,సుదర్శన్, శిక్షావలి,తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడ ధర్నా చౌక్‌లో వైసిపి యువత పోరు




విజయవాడ సెంట్రల్, జూన్ 23 (మనం న్యూస్): వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమానికి వైసిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే లు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, మొండితోక జగన్ మోహన్ రావు, విజయవాడ మేయర్ రాయల భాగ్యలక్ష్మి , డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ , అవుతూ శైలజ, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొరివి చైతన్య, జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు లు యువత పోరుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగాఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమం నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో విద్యార్థులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలును చంద్రబాబు మోసం చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్,బీజేపీ లు ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ హామీలు ఇచ్చి ఇప్పుడు ఏమి అయిపోయాడని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఏ ఒక్కరికి అందటం లేదన్నారు. దీనిపై యువతకు నారా లోకేష్ ఏం సమాధానం చెబుతారంటూ నిలదీశారు. జగన్ హయంలో వాలంటీర్,సచివాలయ వ్యవస్థలను తెచ్చారని గుర్తు చేశారు. కూటమి హయంలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సత్తెనపల్లి లో కారు ప్రమాదంపై ఎస్పి క్లారిటీ ఇచ్చారన్నారు. ఐదు రోజుల తర్వాత జగన్ కి దక్కుతున్న జనధారణ చూసి నకిలీ వీడియో తో జగన్ పై కేసు పెట్టారని చెప్పారు. పేపర్ల లో అబద్ధపు రాతలు రాస్తున్నారన్నారు. గతంలో జగన్ కారులో వెళ్తున్నప్పుడు ఏదో ప్రమాదం జరిగితే వెంటనే స్పందించిన వ్యక్తి జగన్ అని గుర్తు చేశారు.ఎమ్మెల్సి అరుణ్ కుమార్ నీ పంపించి ఆమెకు వైద్యం అందించమని చెప్పారని అది గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జగన్ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా ఉంటామన్నారు.

# ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలి

- రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్




కర్నూలు, జూన్ 23(మనం న్యూస్): బస్సుల ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థులు భద్రత విషయంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న కండిషన్ లేని ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని కర్నూలు జిల్లా ఇన్చార్జ్ డిఆర్ఓ వెంకటేశ్వర్లు సార్ గారికీ పబ్లిక్ గ్రీవెన్స్ లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ..కర్నూల్ జిల్లా వ్యాప్తంగా వున్నా ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ,మరోవైపు బస్సుల ఫీజుల పేరుతో తక్కువ కిలోమీటర్ల గాను వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులు కాలం చెల్లిన మరియు సామర్థ్యం లేని బస్సులు అనేకంగా ఉన్నాయని, ఫిట్నెస్ పరీక్షల్లో నిర్వహించకుండా బస్సులు తిరుగుతున్నాయని, పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల అయితే తక్కువ జీతం ఇస్తూ డ్రైవర్లను నియమించుకొని లైసెన్సులు లేకుండా కొనసాగిస్తూ వారి శ్రమను వాడుకుంటున్నారని, బస్సులో సహాయకుడిగా విధిగా నియమించాల్సి ఉండగా నియమించలేదని,జిల్లాలో ప్రతి ఒక్క విద్యాసంస్థల బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రస్తుతం అవి కనబడలేదు అనీ అన్నారు. మోటార్ వాహనాల చట్టానికి విరుద్ధంగా వాహన పర్మిట్, ఫిట్నెస్,కాలుష్య నియంత్రణ, బీమా,డ్రైవర్ లైసెన్స్ పత్రాలు బస్సులో నిత్యం ఉండాలని అవి ఉండడం లేదని మండిపడ్డారు. కావున స్పందించి రవాణాశాఖ అధికారులు మోటార్ వాహనాలకు చట్టానికి విరుద్ధంగా తిరుగుతున్న ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని విద్యార్థుల భద్రత కాపాడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా నాయకులు మధు, కార్తీక్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మనం Manam



# రైతుల ఖాతాల్లో భరోసా నిధులు

- **జిల్లాలో 78347 మంది రైతుల ఖాతాల్లో రూ.96 కోట్ల 63 లక్షలు జమ**

| SNo. | Mandal | Farmers | Amount |
|---|---|---|---|
| 1 | ETURNAGARAM | 6605 | 77022460 |
| 2 | GOVINDARAOPET | 6271 | 75369513 |
| 3 | KANNAIGUDEM | 4759 | 55840512 |
| 4 | MANGAPET | 9911 | 152749745 |
| 5 | TADVAI (SAMMAKKA SARAKKA) | 7184 | 108825792 |
| 6 | VENKATAPURAM | 7696 | 92632518 |
| 7 | WAZEED | 8261 | 94820257 |
| 8 | MULUG | 16915 | 182291929 |
| 9 | VENKATAPUR | 10745 | 126756934 |
| | Total | 78347 | 966309660 |

ములుగు, జూన్23 (మనం ప్రతినిధి): రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైంది. 2025 వానాకాలం లో సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ విధంగా సాగుకు ముందు పెట్టుబడి సాయంగా రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలో సహాయం అందించడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు. రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో 2025 సంవత్సరం వానాకాలం సీజన్ కు గానూ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడం సోమవారం నుంచి ప్రారంభించింది. ఎకరానికి సంవత్సరం కు 12 వేల రూ. ల చొప్పున వానాకాలం 2025 సీజన్ కు 6 వేల రూ ల చొప్పున రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది.

**జూన్ 23 మ|| 3 గంటల వరకు**

78347 మంది రైతుల ఖాతాల్లో రూ.96 కోట్ల 63లక్షల నిధులు విజయవంతంగా జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. వానాకాలం 2025 రైతు భరోసా నిధుల పంపిణీపై మండలాల వారీగా వివరాలు జూన్ 23 ఉదయం 10 గంటల వరకు జిల్లాలో వానాకాలం 2025కు సంబంధించిన రైతు భరోసా నిధుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. మొత్తం 9 మండలాల నుంచి 86273 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందుకోసం రూ.103 కోట్ల 70 లక్షల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, కాగా ఇప్పటి వరకు 78347 మంది రైతులకు రూ.96 కోట్ల 63 లక్షల నిధులు విజయవంతంగా జమయ్యాయి.

ఈ కార్యక్రమం రైతు సం క్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కు నిదర్శనమని, వ్యవసాయ అధికారులు మరియు బ్యాంకర్ల సమన్వయంతో ఈ పంపిణీ సమర్థవం తంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఏటూరు నాగారం మండలంలో 6605 మంది రైతులకు రూ.7 కోట్ల 70 లక్షలు, గోవిందరావుపేట మండలంలో 6271 మంది రైతులకు రూ.7 కోట్ల 53 లక్షలు, కన్నాయిగూడెం మండలంలో 4759 మంది రైతులకు రూ.5 కోట్ల 58 లక్షలు, మంగంపేట మండలంలో 9911 మంది రైతులకు రూ.15 కోట్ల 27 లక్షలు, తాడ్వాయి మండలంలో 7184 మంది రైతులకు రూ.10 కోట్ల 88 లక్షలు, వెంకటాపురం మండలంలో 7696 మంది రైతులకు రూ.9 కోట్ల 26 లక్షలు, వజీద్ మండలంలో 8261 మంది రైతులకు రూ.9 కోట్ల 48 లక్షలు, ములుగు మండలంలో 16915 మంది రైతులకు రూ.18 కోట్ల 22 లక్షలు, వెంకటాపూర్ మండలంలో 10745 మంది రైతులకు రూ.12 కోట్ల 67 లక్షలు రైతు భరోసా నిధులు వారి ఖాతాలలో జమ కావడం జరిగిందని తెలిపారు. ప్రారంభంలోనే పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేసిన ఈ నగదును జిల్లాలను రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు వాడుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

కరీంనగర్, జూన్ 23(మనం బ్యూరో): కరీంనగర్ జిల్లా రామడుగు మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి హాజరు అయి మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అఖండ భారత్ కోసం జాతీయ వాద,ఆర్థిక,స్వాలంబన సంస్కృతి క జాతీయ వాదమే లక్ష్యంగా ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు. భారత దేశ మొట్టమొదటి నెహ్రూ ప్రభుత్వం లో బారి పరిశ్రమల శాఖ మంత్రి గా సేవలు అందిస్తు మన రాజ్యాంగం లో జమ్మూ కశ్మీర్ ప్రాంతానికి స్వయం ప్రతి పత్తి కల్పించడమే కాకుండా 370 ఆర్టికల్ ను పొందుపరుచడానికి వ్యతిరేకంగా తన మంత్రి పదవికి రాజీనామా చేసి దేశ వ్యాప్తంగా పరియటిస్తూ ఇస్ దేశ్ మే దో ప్రధాన్, దో విధాన్, దో నిషన్ నాహి చలేగా నాహి చలేగా అని నినదిస్తూ ఈ దేశం కోసం తన ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా వదిలిన గొప్ప మహనీయుడు అని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్,మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్,మాజీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు జిట్టవేని అంజిబాబు,మండల ఉపాధ్యక్షుడు కారుపాకల అంజిబాబు,దళిత మోర్చా మండల అధ్యక్షులు సెంటి జితేందర్, యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడవెల్లి రామ్,మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి లక్ష్మణ్,బూత్ కమిటీ అధ్యక్షులు కడారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కాషాయ బాహుబలి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరి వీరారెడ్డి**



మర్రిగూడ, జూన్ 23(మనం న్యూస్): కాషాయ బాహుబలి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరి వీరారెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో సోమవారం రోజు బలిదాన్ దివాస్ సందర్భంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్రీ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిజెపి మర్రిగూడ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి హాజరై కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతదేశానికి చెందిన ఒక ప్రముఖ రాజకీయ న్యాయవాది విద్యావేత్త అని అన్నారు.జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను వ్యతిరేకించారని, ఒకే దేశం ఒకే పతాకం ఒకే రాజ్యాంగం నినాదాన్ని ఇచ్చారని తెలిపారు. 1953 లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో అరెస్ట్ అయిన తర్వాత ఆకస్మికంగా మరణించారని అన్నారు.

భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తూ అవినీతి రహిత పాలనని కొనసాగిస్తూ భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపిన ఘనత నరేంద్ర మోడీదే అని అన్నారు. కరోనా సమయం నుంచి ప్రతి ఒక్కరికి 5 కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.2 లక్షల 50 వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదని, అలాగే రాష్ట్రంలో కొనసాగుతున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ప్రజలని మభ్యపెడుతూ పబ్బం గడుపుతూ కాలయాపన చేస్తుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి యాస అమరేందర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు యాస అశోక్ రెడ్డి, జిల్లా దళిత మోర్చా నాయకులు గార గోపాల్, మండల ఉపాధ్యక్షులు కేసరి రవీందర్ రెడ్డి, సిలువేరు వెంకటేష్, గ్యార రామలింగం, నరసింహ చారి, మండల ప్రధాన కార్యదర్శులు చాపల వెంకటేష్, రాచకొండ ప్రదీప్ రెడ్డి, సీనియర్ నాయకులు మామిడి పరుశురాం,నారోజు కుమార స్వామి, జిల్లా కిషోర్, మండల కార్యదర్శిలు అంబాల రమేష్ గౌడ్, శోభన్ బాబు. గిరిజన మోర్చా అధ్యక్షులు భాస్కర్ నాయక్, కొట్టం నాగరాజు, పంగ యాదయ్య, బూత్ అధ్యక్షులు, వడ్డేమాన్ సైదులు, వట్టి కోటి జగన్, దేవేందర్ ,రమావత్ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**మంగపేట, జూన్ 23(మనం ప్రతినిధి):** మంగపేట మండల కేంద్రంలోని జూనియర్ కాలేజ్‌లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం ఎస్ఐ టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో సెకండ్ ఎస్ఐ సురేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్త్స సురేష్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు.చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు.యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు.ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపల ఉన్న బాల బాలికలపై లైంగిక వేధింపులు, దాడులు, చిత్రీకరణలు, ఇతర అనుచిత ప్రవర్తనలపై తీవ్ర శిక్షలు ఉండనున్నాయని వివరించారు. విద్యార్థులు తమను తాము ఎలా రక్షించుకోవాలో ఏమైనా అనుమానాస్పద ఘటనలు జరిగినప్పుడు పోలీసులకు ఎలా సమాచారం ఇవ్వాలో అవగాహన కల్పించారు. చట్టబద్ధమైన చర్యలు తీసుకునే విధానం, బాధితులను ఎలా రక్షించాలో వివరించారు.విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

## డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

**కీవ్, జూన్ 23:** కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో..కీవ్‌పై 350కి పైగా డ్రోన్లు, 11 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ దాడిలో 10మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా.. అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసం అయినట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని..వారిని బయటకు తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికత్స అందిస్తున్నామని.. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. కీవ్‌పై చేసిన దాడిలో రష్యన్ దళాలు ఉత్తర కొరియాకు చెందిన ఆయుధాలను ప్రయోగించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. ఇదే విధంగా కిమ్ మాస్కోకు ఆయుధాలను, సైన్యాన్ని పంపిస్తే యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు రష్యాపై ఒత్తిడి తేవాలనే తమ డిమాండ్‌ను సోమవారం యూకే పర్యటనకు వెళ్లిన తమ దేశ రక్షణ మంత్రి మరోసారి ప్రపంచ దేశాలకు వినిపించనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఈ వారం హేగ్లో జరిగే నాటో శిఖరాగ్ర సమావేశానికి ముందు తాను లండన్‌లో ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌తో సమావేశం అవ్వనున్నట్లు తెలిపారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని జెలెన్స్కీ పశ్చిమ దేశాలను కోరారు. ప్రజలు నివాసం ఉండే భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేసిందని, వాటిని ధ్వంసం చేసిందని ఆరోపించారు. మాస్కో యుద్ధాన్ని పొడిగిస్తోందని ప్రతిరోజు ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు తీస్తోందని వాపోయారు. అమెరికా మౌనం వల్ల తమ దేశంలో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, నాలుగు ప్రావిన్స్‌లు తమకు చెం దుతాయని అంగీకరించడం వంటివి నెరవేరిస్తే యుద్ధం ముగింపుపై ఆలోచిస్తామని పుతిన్ పేర్కొన్నారు.

## ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయెల్ కారణం: ఉత్తర కొరియా



**ప్యోంగ్యాంగ్, జూన్ 23:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. మరోవైపు ఈ యుద్ధంలోకి అమెరికా నేరుగా అడుగుపెట్టింది. ఇరాన్‌లోని అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అగ్రరాజ్యం విరుచుకుపడుతోంది. తాజా పరిణామాలపై ఉత్తర కొరియా స్పందించింది. ఇరాన్‌పై అమెరికా దాడులను ఆ దేశం తీవ్రంగా ఖండించింది. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయెల్ కారణమని మండిపడింది. ఈ దాడులు ఒక సార్వభౌమ దేశ భద్రతా ప్రయోజనాలను, ప్రాదేశిక హక్కులను ఉల్లంఘించడమేనని ఉత్తర కొరియా సోమవారం తీవ్రంగా ఖండించింది. ఈమేరకు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. ఇరాన్ భూభాగంపై అమెరికా దాడులను ఉత్తర కొరియా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ ఘర్షణాత్మక చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని పిలుపునిచ్చింది. ''నిరంతర యుద్ధ ఎత్తుగడలు, ప్రాదేశిక విస్తరణను పశ్చిమ దేశాలు ఆమోదించాయి, ప్రోత్సహిస్తున్నాయి'' అని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ మండిపడింది. ఇరాన్, ఉత్తర కొరియా మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేయడం సహా ఇరుదేశాల మధ్య దశాబ్దాలుగా సైనిక సహకారం కొనసాగుతోంది. ఇక ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అత్యంత శక్తిమంతమైన బాంబర్లు, క్షిపణులతో అమెరికా విరుచుకుపడింది. 3 అణు కేంద్రాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ 40 క్షిపణులతో దాడులకు దిగింది. బహుళ వార్‌హెడ్ల ఖోరాంశహర్-4ను ప్రయోగించింది. దీంతో ఇజ్రాయెల్ దద్దరిల్లింది. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో ప్రపంచ దేశాలన్నీ స్పందిస్తున్నాయి.

# మత్తులో భవిష్యత్తును పాడు చేసుకోవద్దు

- **డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి**
- **మొక్కలు నాటిన సెక్రెట్ హార్ట్ స్కూల్ విద్యార్థులు**
- **గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్**



రామగుండం, జూన్ 23(మనం న్యూస్): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ సూచించారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా హెల్ యూర్ మైండ్ అండ్ ప్లాన్ ఎ ట్రి - సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెక్రెడ్ హార్ట్ స్కూల్లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి మత్తుపదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహనతో పిల్లలతో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష సాధన దిశగా అడుగులు వేయాలన్నారు, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకుని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. మీ కాలనీ, మీ చుట్టూ ప్రక్కల ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందన్నారు. ఎసిపి, సీఐ, ఎస్ఐలు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమేష్, భూమేష్, పోలీస్ సిబ్బంది, టీచర్స్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు




ఢిల్లీ, జూన్ 23: ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హాం నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దారి మళ్లించారు. శనివారం ఈ ఘటన జరగగా ఆ విమానం సౌదీ అరేబియాలోని రియాద్‌లో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు విమానయాన సంస్థ ఆదివారం ప్రకటిం చింది. అక్కడి నుంచి ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్ల డించింది. మరోవైపు పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కొన్ని సర్వీసు లు రద్దవుతున్నాయని లేదా ఆలస్యమవుతున్నా యని ఎయిర్ ఇండియా తెలిపింది.

# ఒబామాకు చర్చించడం రాదు

- **ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ పాత పోస్టు వైరల్**

వాషింగ్టన్, జూన్ 23: ఇరాన్‌తో యుద్ధం అంశంపై అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాను ఉద్దేశిస్తూ ట్రంప్ గతంలో చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరలయ్యాయి. ''ఇరాన్‌తో చర్చలు జరిపే సామర్థ్యం ఆయనకు లేదు. అందుకే ఆయన యుద్ధానికి వెళ్లే అవకాశం ఉంది'' 2011లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఉద్దేశిస్తూ డొనాల్డ్ ట్రంప్ అన్న మాటలివి. కట్ చేస్తే.. సరిగ్గా 14 ఏళ్ల తర్వాత ఇరాన్‌పై బాంబులతో ట్రంప్ విరుచుకుపడ్డారు. పశ్చిమాసియా రణరంగంలోకి అగ్రరాజ్యం నేరుగా అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ట్రంప్ గతంలో చెప్పిన మాటలకు.. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు పూర్తిగా విరుద్ధంగా ఉండటంతో ఆయన పాత పోస్టులు ఇప్పుడు నెట్టింట వైరల్గా మారాయి. 2011 నవంబరులో ట్రంప్ ఓ పోస్ట్ చేశారు. ''ఎన్నికల్లో గెలవడం కోసమే ఒబామా ఇరాన్‌తో యుద్ధాన్ని ప్రారంభిస్తారు''అని అందులో రాసుకొచ్చారు. అదే ఏడాది ఆయన మాట్లాడిన ఓ వీడియో కూడా బయటికొచ్చింది. ''ఇరాన్తో చర్చలు జరిపే సమర్థత ఒబామాకు లేదు. ఆయన ఓ బలహీన, అసమర్థ అధ్యక్షుడు'' అని నాడు ట్రంప్ విమర్శించారు. ఇక, 2013లోనూ ఇదే తరహా ఆరోపణలు చేశారు. ''ఇరాన్‌పై ఒబామా దాడి చేస్తారని నేను ఏనాడో అంచనా వేశా. ఆయనకు చర్చించడం రాదు'' అంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ప్రస్తుతం ఈ పోస్టులను నెటిజన్లు తెగ షేర్ చేస్తున్నారు. ఇదిలాఉండగా.. టెహ్రాన్‌తో విభేదాలను తగ్గించుకునేందుకు 2015లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా అణుఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే, 2018లో ట్రంప్ తొలిసారి హయాంలో ఆ ఒప్పందం నుంచి వైదొలగడం గమనార్హం. ఇరాన్ అణుస్థావరాల ధ్వంసమే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించింది. ఈక్రమంలోనే నెతన్యాహు సర్కారుకు మద్దతుగా అగ్ర రాజ్యం కూడా నేరుగా యుద్ధ రంగంలోకి అడుగుపెట్టింది. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై ఆదివారం తెల్లవారుజామున అమెరికా దాడులు చేసింది. పర్వతాల అడుగున 90 మీటర్ల లోతున్న ఫోర్డో కేంద్రంపై బీ2 బాంబర్లతో 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. దీనిపై ట్రంప్.. అణుకేంద్రాలను తుడిచిపెట్టామన్నారు.

# నోబెల్‌కు ట్రంప్... ప్రతిపాదనను ఉపసంహరించండి?

- **సమీక్ష కోసం పాక్ ప్రతిపక్షాల డిమాండ్**



ఇస్లామాబాద్, జూన్ 23: ఇరాన్‌లోని న్యూక్లియర్ సైట్లపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ బహుమతి ఇవ్వాలనే ప్రతిపాదన సరికాదని, దానిని సమీక్షించాలని పాక్ ప్రభుత్వాన్ని అక్కడి ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ట్రంప్‌నకు '2026 నోబెల్ శాంతి పురస్కారం' ఇవ్వాలని పాకిస్థాన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ట్రంప్‌ను పాకిస్థాన్ నోబెల్‌కు ప్రతిపాదించిన మర్నాడే ఆయన ఇరాన్‌పై దాడులు చేపట్టడంతో పలు దేశాలు ఆయన చర్యలను ఖండించాయి. ఈ విషయంపై పాకిస్థాన్‌లోని ప్రతిపక్షాలు సైతం ఆ దేశ ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. ఇరాన్‌లోని న్యూక్లియర్ సైట్లపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో ట్రంప్‌నకు నోబెల్ బహుమతి ఇవ్వాలనే ప్రతిపాదన సరికాదని, షరీఫ్ ప్రభుత్వం దానిని పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రతిపక్ష పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ శాసనసభ్యుడు అలీ ముహమ్మద్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో తమ మద్దతు టెహ్రాన్‌కే అని స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడులకు పాల్పడిన అమెరికా అధ్యక్షుడిని నోబెల్ బహుమతికి ప్రతిపాదించినందుకు పాక్ ప్రభుత్వం సిగ్గుపడేలా ట్రంప్ ప్రవర్తించారని మండిపడ్డారు. ఇకనైనా ఆ ప్రతిపాదనను షరీఫ్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌లోని జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం పార్టీకి నాయకత్వం వహిస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుడు మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ ఈవిషయంపై మాట్లాడుతూ..అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతి కాముకుడు అనే వాదన తప్పని ఆయనే స్వయంగా నిరూపించుకున్నాడని అన్నారు. పాలస్తీనా, సిరియా, లెబనాన్, ఇరాన్లపై ఇజ్రాయెల్ దాడులకు మద్దతిచ్చిన అమెరికా అధ్యక్షుడు శాంతిదూత ఎలా అవుతాడని ప్రశ్నించారు.

ఇకనైనా పాక్ ప్రభుత్వం నోబెల్ బహుమతికి ఆయన పేరును ప్రతిపాదించడాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో ట్రంప్ సమావేశమయ్యి..ఆయనకు విందు ఇవ్వడంతో పాక్ అమెరికా అధ్యక్షుడిని నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించి ఉంటుందని పేర్కొన్నారు. ట్రంప్ శాంతి కోసం పనిచేసే నాయకుడు కాదని.. ఉద్దేశపూర్వకంగానే ఆయన పలు యుద్ధాలకు మద్దతునిస్తున్నారని పాక్ మాజీ సెనేటర్ ముషాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు. అన్ని దేశాలను నాశనం చేయాలనే ఆలోచనతో ట్రంప్ అమెరికా పతనానికి అధ్యక్షత వహిస్తున్నారని దుయ్యబట్టారు. రక్తంతో తడిచిన ఆయన చేతులకు శాంతి బహుమతిని అందుకునే హక్కు లేదని అన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- డీవైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, చిన్న, వీరేంద్ర నాయుడు




కుంకునూరు గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

దేవనకొండ, జూన్ 23(మనం ప్రతినిధి): దేవనకొండ మండల పరిధిలోని కుంకునూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, చిన్న, వీరేంద్ర నాయుడులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.... గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు తిరగలేని దుస్థితి నెలకొంది అన్నారు. డ్రైనేజీ వలన సీజనల్ వ్యాధులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యలతో పాటు తాగునీటి సమస్య ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం సచివాలయం కార్యాలయం వద్ద ఖాళీ కుర్చీకి వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింహాద్రి, పెద్ద హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్లకు వరాలు.. పేదలకు శాపాలు

పత్తికొండ, జూన్ 23(మనం న్యూస్): పత్తికొండ పట్టణంలోని స్థానిక మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి భవనంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ కమిటీ సభ్యులు దస్తగిరి, గంగన్న, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు పెద్ద కాశి, సిఐటియు నాయకులు ఎం.రవిచంద్ర, ఆధ్వర్యంలో దారి తప్పుతున్న కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పై సోమవారం బుక్లెట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో హామీలే తప్ప అమలు ఎక్కడ? అని ప్రశ్నించారు. సామాన్యులకు సంక్షేమ పథకాలు దూరం చేయడంలో భాగంగా అనేక అవంతరాలను సృష్టించి సామాన్యులకు సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నారన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం ఎక్కడ చేయూతని అందిస్తుందని యువతకు పూర్తిస్థాయిలో అభివృద్ధి దూరం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేటర్లకు భూములు కేటాయింపు ఉపాధి రాకున్నా పరిశ్రమలు పెట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ పి3- పి4 పేరుతో ప్రభుత్వ ఆస్తులు కార్పొరేటర్లకు దారాదత్తం కార్పొరేటర్లకు వడ్డీ పన్ను రాయితీలు నీరు విద్యుత్ పై తగ్గింపు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వికేంద్రీకరణ స్థానంలో అభివృద్ధి కేంద్రీకరణ వెనుకబడిన ప్రాంతాల నిర్లక్ష్యం




ప్రజలపై విద్యుత్ ఆస్తి పన్ను భారాలు రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కేంద్రం ప్రభుత్వ బిల్లు నూతన విద్యా విధానం విద్యుత్ ఒప్పందాలు వ్యవసాయ మార్కెట్ చట్టం లేబర్ కోడ్స్ కు మద్దతు ఇలాంటి చర్యలు కూటమి ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా చేయడం ఎంతవరకు సమంజసం అని వారు పేర్కొన్నారు.ఇక సూపర్ సిక్స్ పథకాల విషయానికి వస్తే నెలకు రూ 3వేలు నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్న ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించడం లేదని నిరుద్యోగ భృతి చెల్లించక పోవడం వల్ల ఈ సంవత్సరం పాలనలో ఒక్కో నిరుద్యోగి రూ.36 వేలను నష్టపోయారన్నారు. ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అంటే సంవత్సరానికి నాలుగు లక్షలు ఉద్యోగాలు ఇవ్వాలి. అలాంటి పరిస్థితుల్లో ఈ సంవత్సరం నాలుగు లక్షల ఉద్యోగాలు కాదు కదా ఇప్పటికే ఉన్న మూడు లక్షల చిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల అరవై వేల మంది వాలంటీర్లను 15 వేల మంది బేవరేజస్ కార్పొరేషన్ ఉద్యోగులతో పాటు రేషన్ వాహనాల మీద ఆధారపడి 20వేల మంది ఉపాధిని తొలగించిందన్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలు నడుపుకునే వారిని చాలా జిల్లాల్లో బలవంతంగా కాళీ చేయించారన్నారు. మున్సిపాలిటీ నగర కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆప్కాబ్ ద్వారా పొందుతున్న వేతన విధానాన్ని రద్దు చేసిందన్నారు. అంతే కాకుండా మరలా పాత కాంట్రాక్టర్ల వ్యవస్థకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు నత్తనడకన సాగుతున్నాయని సంక్షేమం విషయంలో ప్రజల్లో ఇంకా పూర్తిస్థాయిలో అసంతృప్తి సూపర్ సిక్స్ పథకాలకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం పింఛన్ పెంపు అన్నా క్యాంటీన్లు దీపం టు పథకాలను చేయడంలో పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేదన్నారు. మిగిలిన పథకాలు ఎప్పుడూ అమలు చేస్తారని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం వాటిపైన పూర్తిస్థాయిలో ప్రకటన చేయకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కరెంటు చార్జీలు తగ్గిస్తామన్న ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అత్యధికంగా భారం పడిన వ్యవస్థ ఏదైనా ఉందంటే అది విద్యుత్తేనని సామాన్యులకు మధ్యతరగతి ప్రజలకు నెత్తిన బండ వేసిన విధంగా అమాంతం కరెంటు చార్జీలు పెంచిందన్నారు.మొత్తానికి కూటమి ప్రభుత్వం దారి తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు రమేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్,అమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఉరుకుందు, శ్రీను, ఆచారి, సుంకన్న, ఆవాజ్ కమిటీ నాయకులు హజరత్ ఆలీ, డి. అల్లిపిర, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పట్టించుకోని కూటమి

- వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జరపాటి రామాంజనేయులు

కర్నూల్, జూన్ 23(మనం న్యూస్): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండానే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక సంవత్సరాన్ని గడిపేసిందని వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జరపాటి రామాంజనేయులు సోమవారం కర్నూల్ నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపటం,



ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని కొనసాగించడం, ప్రభుత్వ భూములను పెట్టుబడిదారులకు అప్పగించడం, మద్యాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయకపోవడం వంటి చర్యల ద్వారా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న వ్యతిరేక వైఖరి ఎటువంటిదో స్పష్టంగా తెలుస్తోందని దుయ్యబట్టారు. అంతేకాకుండా కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో వలసలు ఆగడం లేదని, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తికాక సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం, విద్యా-వైద్య రంగాల ప్రైవేటీకరణను వేగంగా అమలు చేయడం, ధరల నియంత్రణను పట్టించుకోకపోవడం, మహిళలపై నేరాలు, విద్యార్థుల, రైతుల ఆత్మహత్యలను అడ్డుకునే చర్యలు తీసుకోకపోవడం ద్వారా ఈ ప్రభుత్వం తన వైఫల్యాన్ని మరోసారి నిరూపించుకుందని ఘాటుగా విమర్శించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న ఫాసిస్ట్ విధానాలకు తెలుగుదేశం, కూటమి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని మత సామరస్యానికి ప్రమాదం ఏర్పడిందని, మతోన్మాద రాజకీయాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజల సమస్యలపై పోరాడే, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనే ఐక్యవేదికగా అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

## ఘనంగా శ్రీ విజయేంద్ర తీర్థుల ఆరాధన

మంత్రాలయం, జూలై 23(మనం న్యూస్): తమిళనాడు రాష్ట్రం, కుంభకోణంలో వెలసిన విజయేంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో, విజయీంద్ర తీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం, ఫల పుష్పాభి షేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మూల రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి ,మంగళహారతి ఇచ్చారు. భక్తులు ముందుగా విజయీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పీఠాధిపతులు ఫల పుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



## ప్రజా సమస్యలపై అధికారులు సమన్వయంతో పని చేయాలి

పరిపాలన అధికారి కె.వసుంధర



ఆదోని, జూన్ 23(మనం న్యూస్): ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పరిపాలన అధికారి కె.వసుంధర ఆధ్వర్యంలో ప్రజల నుండి అనేక వినతులను స్వీకరించి, తగిన సూచనలు, సూచనలిచ్చారు. ప్రజా సమస్యలను పై స్థాయికి తెలియజేసి, వేగంగా పరిష్కరించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని ఆమె అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీ ఉల్లా, డీఎల్డీఓ బాలకృష్ణారెడ్డి, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డీఎంహెచ్వో సత్యవతి, వ్యవసాయ శాఖ అధికారులు బాలవర్ధి రాజు, ఖాద్రి, ఆర్టీవో, పరిపాలన అధికారి రమాదేవి, ఉప తహశీల్దారులు బాబు, రుద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

జూపాడు బంగ్లా, జూన్ 23(మనం న్యూస్): నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండల కేంద్రంలో సోమవారం డిఎస్‌యు జిల్లా నాయకులు రంగస్వామి, అధ్యక్షతన జిల్లా కార్యవర్గ నూతన ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాయలసీమ ఇంచార్జ్ శరత్ హాజరయ్యారు. అనంతరం, రాయలసీమ జిల్లాల ఇన్చార్జి ఆర్ శరత్ నంద్యాల జిల్లా నూతన కమిటీ ఏర్పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మద్దూరు వీరబాబు వేటూరి రంగస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ ఇన్చార్జ్ ఆర్ శరత్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థను కాపాడటమే డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ లక్ష్యం అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, విద్య వ్యవస్థను పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తూ విద్యను నాశనం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం స్కీం కింద రాష్ట్రంలో 80 లక్షల మంది విద్యార్థులు స్టూడెంట్స్ ఉంటే కేవలం 67 లక్షల విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం వర్తించింది, మిగతా స్టూడెంట్స్ ఎడ్యుకేషన్ మినిస్టర్ నారా లోకేష్‌కి కనిపించలేదా, అలాగే, మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం చాలా సిగ్గుచేటు, దేశంలో నరేంద్ర మోడీ బిజెపి జాతీయ నూతన విద్య విధానంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. నరేంద్రమోడీ తీసుకొస్తున్న విధానాలు కార్పొరేట్‌కి మేలు చెయ్యడమే అని అన్నారు కావున విద్య వ్యవస్థను కాపాడుకోవడం కోసం విద్యార్థులు అంత కలిసి గట్టిగ పోరాటం చెయ్యాలని ఈ సమావేశంలో పిలుపునిచ్చారు. అనంతరం నూతన డియస్‌యు జిల్లా కమిటీ ఏకగ్రీవ ఆమోదంతో ప్రకటించారు. 1) జిల్లా అధ్యక్షులు మద్దూరు వీరబాబు 2) జిల్లా ప్రధాన కార్యదర్శి వేటూరి రంగస్వామి,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ డోన్, వెంకీ బేతంచెర్ల జిల్లా సహాయ కార్యదర్శులు రంజిత్ కుమార్ రెడ్డి కర్నూల్, శేఖర్ మంత్రాలయం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల నాయకులు శేఖర్, నవీన్, రాజు పాల్గొన్నారు.



## అధికారం ఉన్నా.. లేకున్నా.. మేము పేద ప్రజల పక్షమే




- ప్రజా పోరాటాలే సీపీఐ అజెండా
- సీపీఐ జిల్లా నాయకులు ఏం.రమేష్ బాబు

జూపాడు బంగ్లా, జూన్ 23(మనం న్యూస్): దేశంలో వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ ప్రజా పోరాటాల అజెండగా ముందుకు వెళుతుందని అధికారం ఉన్న లేకున్నా ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్ర జెండా ఉంటుందని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు అన్నారు.. సోమవారం చాపలు గ్రామ శాఖ మహాసభ నాగన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్వాతంత్రం కోసం ఏర్పడిన సిపిఐ పార్టీ అనేక ప్రాణ త్యాగాలతో ప్రజల పక్షాన నిలిచిందన్నారు. గూడు గూడు విద్య వైద్యం పేద ప్రజల హక్కుగా రాజ్యాంగం కల్పించిన ఫలాలు అందరికీ అందాలని పోరాటం కొనసాగిస్తుందన్నారు. జూపాడు బంగ్లా మండలంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎర్రజెండా చేతబట్టి పాలక ప్రభుత్వాలకు అధికారులకు ఎదురెడ్డి నిలిచి సమస్య పరిష్కారం కోసం కృషి చేసిందన్నారు. చాబోలు గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోతి రెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ బ్లాస్టింగ్ పనుల్లో ఇల్లు దెబ్బతింటే వారి పక్షాన నిలబడి వారికి నష్టపరిహారం ఇచ్చిన చరిత్ర సిపిఐ అన్నారు. తక్షణమే చాబోలు గ్రామ ప్రజలకు జూపాడు బంగ్లా మండలంలో ప్రతి కుటుంబానికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ విషయంపై రాబోయే రోజుల్లో ప్రత్యక్ష పోరాటం కొనసాగిస్తామన్నారు జులై 13 వ తారీఖున జూపాడు బంగ్లా మండల మహాసభలు నిర్వహిస్తున్నామని. ఈ మహాసభలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. శాఖ నూతన కార్యదర్శిగా నాగన్న సహాయ కార్యదర్శిగా రమణాలను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు శీను మక్బూల్ బాషా వెంకటరమణ శేఖర్ పాల్గొన్నారు.

# గ్రామాల సమస్యల పరిష్కారానికి పెన్ డౌన్ నిరసన

జూపాడు బంగ్లా జూన్ 23(మనం న్యూస్): జూపాడుబంగ్లా మండలంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు గ్రామ సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నిరసన చేయడం జరిగినది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు డిపార్మెంట్ ఉన్నత అధికారులకు రెప్రెంటేషన్ ఇవ్వడం జరిగిందని, 5 సంవత్సరాలు పూర్తి అయిన ఎటువంటి పరిష్కారం చూపలేదని. మరియు రేషనలైజేషన్ ట్రాన్స్ఫర్ ప్రక్రియ అమలు చేయు విధానములో మాకు తీవ్ర నష్టం జరుగుతుందని కావున మా న్యాయపరమైన విన్నపాలు పరిష్కారం చూపేవరకు మేము పెన్డౌన్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి తీర్మానం చేసుకున్నామని మండలానికి చెందిన గ్రామ సర్వేలు నిరసన తెలుపుతూ జూపాడు బంగ్లా మండల తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, డిటి నాగన్న, లకు వినతి పత్రం అందజేసి వారి సమస్యలను వివరించడం జరిగింది, స్వర్ణాంధ్ర విజయం 2047లో భాగంగా



సచివాలయం స్టాఫ్ నీ హేతుబద్ధీకరణ చేస్తున్నారు, భూ సర్వేర్లు అయిన మాకు జనాభా ప్రతిపాదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలని, హేతుబద్ధీకరణ చేస్తున్న సర్వేలను వారి సమ్మతితో కౌన్సిలింగ్ ద్వారా ప్రక్రియ చేసి మహిళా ఉద్యోగులు మరియు కుటుంబ పోషణ నిమిత్తం ఇతర డిపార్ట్మెంట్స్ కి వివిధ స్థానాలకు పంపి మునుపు ఉద్యోగుల సమ్మతి మేరకు జరగాలి, మరియు వారికి స్పెషల్ అలవెన్సులు కల్పిస్తూ ఒకే డిపార్ట్మెంట్ సర్వీస్ రూట్ మెయింటైన్ చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని, ప్రమోషన్ ఇచ్చి ట్రాన్స్ఫర్ చేయాలని, సర్వే డిపార్ట్మెంట్ లో ఉన్నటువంటి ఉద్యోగులందరికీ టెక్నికల్ డిపార్ట్మెంట్ చేస్తూ టెక్నికల్ పే స్కేల్ ఇవ్వవలెనని, భూ సర్వే ఫీల్ వర్క్ లో ఫారెస్ట్ లో ముళ్లపొదల్లో వెళ్లి సర్వే చేసే మాకు రిస్కు అలవెన్స్ కల్పించాలని, సర్వే డిపార్ట్మెంట్లలో ఉన్నటువంటి గ్రామ సర్వేలకు విధులకు ఆటంకం కలగకుండా సర్వే పనులు బాధ్యతలు లీఫ్ అప్రూవల్ డి డి ఓ పవర్స్ ఇతర పరిపాలన సౌలభ్యం గల అంశాలు అన్నిటిని సర్వే శాఖకు బదలాయింపు చేయవలెనని, గ్రామస్థాయి ఉద్యోగులమైన మాకు సొంత మండలాల్లో పోస్టింగ్ అవకాశం ఇవ్వాలని, డిపార్ట్మెంట్లో అధిక పని భారం వలన ప్రొబిషన్ డిక్లేర్ కాకుండా ఇప్పటివరకు 15000 జీతంతో డిపార్ట్మెంట్లో జరిగే హై టెక్నికల్ వర్క్ చేస్తూ జీవిత భారం మోస్తున్న గ్రామ సర్వే ఉద్యోగులకు తక్షణం రెగ్యులర్ చేస్తున్నట్లు విధి విధానాలు త్వరగా ఇవ్వవలెనని. రీ సర్వే ప్రాజెక్ట్ కి తగిన పరికరాలు తగిన సమయం ఇవ్వకుండా ఆర్ ఓ ఆర్ సెటిల్ చేయకుండా హడావుడితో అధిక ఒత్తిడి చేస్తూ పనులు చేయిస్తున్నారు, కావున తగిన పరికరాలు ఇస్తూ నిర్దిష్ట టార్గెట్ తగ్గించి నాణ్యమైన రిసర్వే రికారడ్స్ రూపొందించడానికి దోహదపడాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్వేలు పాల్గొనడం జరిగినది

## శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం




తుగ్గలి జూన్ 23(మనం న్యూస్): అఖండ భారతావని కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మండల అధ్యక్షులు లక్ష్మన్న అన్నారు. తుగ్గలిలో సోమవారం ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మన్న, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఆర్కె సురేంద్ర, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, బిజెపి నాయకులు రంగయ్య, దేవేంద్ర, బాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా లక్ష్మన్న, లక్ష్మణ స్వామి మాట్లాడుతూ కాశ్మీర్కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని జనసంఘ్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు ముఖర్జీ చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ప్రాణాలు అర్పించిన గొప్పవ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. ముఖర్జీ ఆశయ సాధనకు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

# బుమ్రా.. కోహినూర్



**స్పోర్ట్స్ డెస్క్:** టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్, జస్ప్రీత్ బుమ్రాపై ప్రశంసల వర్షం కురిపించాడు. లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఈ నేపథ్యంలో బుమ్రా.. కోహినూర్‌లా విలువైనవాడని కార్తిక్ ప్రశంసలు కురిపించాడు. ఫార్మాట్లకు అతీతంగా బుమ్రా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు, బౌలింగ్‌లో నిలకడ గురించి ప్రస్తావించాడు. అలాగే, టెస్ట్ క్రికెట్‌లో 200 కంటే ఎక్కువ వికెట్లు తీసుకున్న బౌలర్లందరి కంటే బుమ్రా యావరేజ్ బాగుంటుందని ప్రశంసించాడు.

## అతడి సత్తా ఏంటో ఇప్పటికే..

'బుమ్రా కోహినూర్‌లా విలువైనవాడు. అన్ని ఫార్మాట్లలో అతడి ప్రాముఖ్యం ఏంటో జనాలు ఇప్పటికే గుర్తించి ఉంటారు. ఏ ఫార్మాట్ అయినా... ఏ బంతి అయినా అతడు తన సత్తా చాటుతాడు. అన్నింటి కంటే ప్రధానంగా బుమ్రా ముందుగానే బ్యాటర్ మనసును చదివేస్తాడు. తర్వాత ఏ షాట్ ఆడబోతున్నాడో.. ఊహించి దానికి అనుగుణంగా తన బంతులను సంధిస్తాడు. టెస్ట్ క్రికెట్‌లో 200కు పైగా వికెట్లు తీసుకున్న బౌలర్లలందరి కన్నా జస్ప్రీత్ బుమ్రాకే మంచి యావరేజ్ ఉంది. అతడు ఎంత ప్రత్యేకమో ఇదే మనకు చెప్పకనే చెబుతుంది' అని దినేశ్ కార్తిక్ ఓ క్రీడా ఛానల్‌తో అన్నాడు.

## ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌట్



తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌట్ అయింది. బుమ్రా 82 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో అతడికిది 14వ, విదేశాల్లో 12వ ఐదో వికెట్ ప్రదర్శన. ఇతర సీమర్ల నుంచి మద్దతు లేని దశలో, అలాగే, ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేసిన తరుణంలోనూ బుమ్రా ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం నిజంగా అద్భుతం. లీడ్‌లోకి వెళ్లకుండా ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేయడంలోనూ బుమ్రా కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో అతడి టెస్ట్ సగటు 19.3. ఈ ఫార్మాట్ చరిత్రలో 200 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన 86 మంది బౌలర్లలో ఇదే అత్యుత్తమం.

# సంజనా.. ఆయనను నువ్వే ఒప్పించాలి

## గవాస్కర్, పుజారా



**స్పోర్ట్స్ డెస్క్:** ఇంగ్లండ్ పర్యటనను టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఘనంగా ఆరంభించాడు. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు కూల్చి.. భారత్‌కు స్వల్ప ఆధిక్యం అందించాడు. బౌలింగ్ దళ భారాన్ని మొత్తం తానే మోస్తూ.. మరోసారి తన విలువను చాటుకున్నాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జాక్ క్రాలే(4), బెన్ డకెట్(4).. అదే విధంగా మరో ప్రధాన బ్యాటర్ జో రూట్(28) రూపంలో మూడు కీలక వికెట్లు కూల్చిన బుమ్రా.. క్రిస్ వోక్స్(38), బ్రైడన్ కార్స్(22) వికెట్లు కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఇదిలా ఉంటే.. టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీలో భాగంగా భారత్ ఇంగ్లండ్‌తో ఐదు టెస్టులు ఆడనుంది. ఐతే, పనిభారాన్ని తగ్గించుకునే క్రమంలో బుమ్రా అన్ని మ్యాచ్‌లు ఆడకపోవచ్చు. జట్టు ప్రకటన సందర్భంగా టీమిండియా చీఫ్ సెలక్ట ర్ అజిత్ అగార్కర్ స్వయంగా వెల్లడించాడు.

## అందుకే కెప్టెన్సీకి కూడా దూరం

అంతే కాదు.. తాను కూడా అన్ని టెస్టులు ఆడలేను కాబట్టే కెప్టెన్సీ వద్దని చెప్పానని బుమ్రా ఇటీవల పేర్కొన్నాడు. ఇక ఇంగ్లడ్‌తో ఆదివారం నాటి మూడో రోజు ఆట ముగిసిన తర్వాత కూడా భవిష్యత్ దృష్ట్యా తాను పనిభారాన్ని మేనేజ్ చేసుకునే విషయంలో 'స్మార్ట్'గా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఈ పరిణామాల నేపథ్యంలో టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్, వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లోనూ బుమ్రా ఆడాలని కోరుకున్న ఈ ఇద్దరు క్రికెటర్లు.. ఇందుకు అతడిని ఒప్పించాలంటూ స్పోర్ట్స్ ప్రజెంటర్, బుమ్రా సతీమణి సంజనా గణేషన్.

## సంజనా.. నాదో రిక్వెస్ట్..

భారత్-ఇంగ్లండ్ టెస్టుల బ్రాడ్‌కాస్టర్ సోనీ నెట్‌వర్క్ షోలో భాగంగా.. ''సంజనా.. నాదో రిక్వెస్ట్.. అన్ని మ్యాచ్‌లు ఆడేలా జస్‌ప్రీత్‌ను నువ్వు మాత్రమే ఒప్పించగలవు. ఒక్కసారి ప్రయత్నించి చూడు. నీకు మాత్రమే అది సాధ్యం'' అని పుజారా సంజనాతో అన్నాడు. ఇంతలో గవాస్కర్ కలుగజేసుకుంటూ.. ''మ్యాచ్‌కి మ్యాచ్‌కి మధ్య కావాల్సినంత విరామం దొరుకుతుంది. దాదాపు ఎనిమిది రోజులు విశ్రాంతి లభిస్తుంది. తదుపరి మ్యాచ్‌కు వారానికి పైగా సమయం ఉంది. ఆ తర్వాత లార్డ్స్ టెస్టుకు.. ఆపై మాంచెస్టర్ టెస్టుకు కూడా ఇదే తరహాలో విరామం లభిస్తుంది.

## జట్టుకు అవసరం ఉంది

మాంచెస్టర్‌లో ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబర్ లేదంటే నవంబరు.. ఎప్పుడైనా బంతి బాగా స్వింగ్ అవుతుంది. ది ఓవల్‌లో ఐదు రోజులు మ్యాచ్ జరిగే అవకాశం ఉంటుంది. జట్టుకు జస్‌ప్రీత్ అవసరం ఎంతగానో ఉంది. అతడు ఐదు టెస్టులు ఆడాలని మేము కోరుకుంటున్నాము. దయచేసి నువ్వు అన్ని మ్యాచ్‌లు ఆడు బుమ్రా'' అని సంజనా సమక్షంలో విజ్ఞప్తి చేశాడు. కాగా, లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 465 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ క్రమంలో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన భారత్.. నాలుగో రోజు ఆటలో భాగంగా 34 ఓవర్ల ఆట ముగిసే సరికి మూడు వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకాలు బాదిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) ఈసారి విఫలమయ్యారు. వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ 30 పరుగులు చేయగా.. ఓపెనర్ కేఎల్ రాహుల్ 52, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ 15 పరుగులతో క్రీజులో ఉన్నారు.

# ఆధిక్యంలో భారత్

స్పోర్ట్స్ డెస్క్: ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో నాలుగో రోజు ఆట కొనసాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో 90/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆటను ప్రారంభించిన టీమ్ ఇండియా భోజన విరామ సమయానికి 153/3తో ఉంది. కేఎల్ రాహుల్ (71, 157 బంతుల్లో 9 ఫోర్లు), రిషభ్ పంత్ (31, 59 బంతుల్లో 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఈ సెషన్‌లో భారత్ ఒక వికెట్ కోల్పోయి 63 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8 ఓవర్ నైట్ స్కోరు 6) ఆట మొదలయ్యాక ఏడో బంతికే వెనుదిరిగాడు. బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో గిల్ బౌల్డ్ అయ్యాడు. తర్వాత రాహుల్, పంత్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతున్నారు. రాహుల్ 87 బంతుల్లో అర్ధ శతకం (ఓవర్ నైట్ స్కోరు 47) అందుకున్నాడు. పంత్, రాహుల్ జోడీ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం (140 బంతుల్లో) నెలకొల్పింది. ప్రస్తుత భారత్ ఆధిక్యం 159 పరుగులు



# నాగార్జున ఆయన కాళ్లకు మాత్రమే దండం పెడతాడు



## మెగాస్టార్ చిరంజీవి

**సినిమా డెస్క్:** శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో వచ్చిన తాజా చిత్రం కుబేర. ఈ మూవీకి విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ వస్తోంది. ధనుశ్ కీలక పాత్ర పోషించిన ఈ సినిమాలో టాలీవుడ్ కింగ్ నాగార్జున కూడా నటించారు. ఈ సినిమా సక్సెస్ కావడంతో మేకర్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. నాగార్జున ఎవరి కాళ్లకు దండ పెట్టడు.. ఒక్క ఆయనకు తప్పా.. అని అన్నారు.

మెగాస్టార్ మాట్లాడుతూ.. 'నాగార్జున ఎవరి కాళ్లకు దండం పెట్టడు.. ఒక్క ఆయన మీ నాన్న గారి (సునీల్ నారంగ్ తండ్రి నారాయణ్ దాస్ నారంగ్) కాళ్లకు తప్పా. నాకు ఆయన అంతే ఇష్టం. ఆయన గౌరవాన్ని నిలబెడుతూ మీరిద్దరు కూడా వెళ్లడం చాలా గర్వంగా ఉంది. అంతే కాకుండా థర్డ్ జనరేషన్ జాన్వీ కూడా అదే బాటలో వెళ్తోంది.

మళ్లీ మాతో సినిమా చేయొచ్చు కదా.. అని సునీల్ నారంగ్ నాతో అన్నారు. మా నాన్నగారు మీ సినిమాలు చేసి బాగా డబ్బులు సంపాదించాం. కానీ, ఆ తర్వాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ పెట్టిన తర్వాత మీకు సినిమాలు రాకుండా పోయాయి కదా.. (నవ్వుతూ). ఇక మీ మూడో తరం నిర్మాత జాన్వీకి ఆల్ ది బెస్ట్. ఇక జాన్వీతో కూడా సినిమా చేస్తే మూడు జనరేషన్స్‌తో చేసినట్లవుతుందని' చిరంజీవి అన్నారు.

# 'దృశ్యం-3' వినూత్న ఆలోచన

## – అన్ని భాషల్లోనూ ఒకే కథ.. ఒకే రోజు విడుదల..



**సినిమా డెస్క్:** మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎంతటి ఘన విజయాన్ని నమోదు చేశాయో.. అందరికీ తెలిసిందే. ఇప్పటికే రెండు చిత్రాలు విడుదల కాగా, 'గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు.. దృశ్యం-3 రాబోతోంది' అంటూ మూడో భాగాన్ని ప్రకటించారు. మరోవైపు జీతూ జోసెఫ్ కథతో సంబంధం లేకుండా హిందీ వెర్షన్‌లో 'దృశ్యం-3' ఉంటుందని అజయ్ దేవ్‌గణ్ ప్రకటించడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. అజయ్ వ్యాఖ్యలతో ఇటు మలయాళం, అటు హిందీలో వేర్వేరు కథలతో 'దృశ్యం-3' వస్తుందని అందరూ అనుకున్నారు. తాజాగా దర్శకుడు జీతూ జోసెఫ్ దీనిపై స్పష్టత ఇచ్చారు. మలయాళంలో తాను రాసిన కథతోనే హిందీ, తెలుగు భాషల్లో 'దృశ్యం-3' వస్తుందని స్పష్టం చేశారు. జీతూ జోసెఫ్ తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ ''వేరొక కథతో 'దృశ్యం-3' హిందీ వెర్షన్ వస్తుందని వార్తలు వచ్చాయి. అందులో నిజం లేదు. హిందీ చిత్రం కూడా నేను అందించిన కథతోనే తెరకెక్కనుంది. స్క్రిప్ట్ పని దాదాపు పూర్తయింది. తుది మెరుగులు దిద్దుతున్నాం. ఒకసారి పూర్తి స్క్రిప్ట్ సిద్ధమైతే, హిందీ మూవీ టీమ్‌కు దానిని అందజేస్తా. అక్కడి కల్చర్, పరిస్థితులకు అనుగుణంగా వాళ్లు కొన్ని మార్పులు చేసుకుంటారు' అని జీతూ జోసెఫ్ అన్నారు. రెండు సినిమాలను ఒకేసారి షూట్ చేసే అవకాశం లేదా? అని అడగ్గా ''ప్రస్తుతం దానిపై నిర్ణయం తీసుకోలేదు. కథానాయకుల డేట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, మేమంతా ఒక ఆలోచన చేస్తున్నాం. మలయాళం, హిందీ, తెలుగు భాషల్లో ఒకేసారి షూట్ చేయలేకపోయినా, అన్ని భాషల్లోనూ ఒకేసారి విడుదల చేయాలన్న ఆలోచన మాత్రం ఉంది. వాళ్ల నుంచి కూడా ఈ ప్రతిపాదన వచ్చింది. ఇది చర్చల దశలో ఉంది. ప్రస్తుతం ఓటీటీల కాలం నడుస్తున్న నేపథ్యంలో వేర్వేరుగా విడుదల చేస్తే, ఇతర భాషల్లో ఈ సినిమాపై ప్రభావం చూపిస్తుంది'' అని జీతూ జోసెఫ్ అభిప్రాయపడ్డారు. మలయాళంలో మొదటి రెండు సినిమాలకు జీతూ దర్శకత్వం వహించారు. ఇప్పుడు 'పార్ట్-3'కి ఆయనే దర్శకత్వం వహించనుండగా, హిందీలో 'దృశ్యం'ను నిషికాంత్ కామత్, 'దృశ్యం-2' అభిషేక్ పాఠక్ తీశారు. మరి మూడో భాగానికి ఎవరు దర్శకత్వం వహిస్తారో? వేచి చూడాలి. ఇక అజయ్ దేవగణ్ అభిషేక్ పాఠక్ వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది. తెలుగులో 'దృశ్యం' శ్రీప్రియ రూపొందించగా, 'దృశ్యం-2'ను జీతూ జోసెఫ్ తీర్చిదిద్దారు. మరి తెలుగులో మూడో భాగాన్ని తెరకెక్కించే అవకాశం ఎవరికి వస్తుందో చూద్దాం.

# తెర వెనక.. ప్రపంచమే ఇష్టం



మాస్ పాటతో మురిపించేందుకు సిద్ధం అంటోంది మాళవిక మోహనన్. ఈ మాట ఇతర కథానాయికలు చెప్పడం వేరు.. మాళవిక చెప్పడం వేరు. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ఫొటోలు కుర్రకారుని ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. మోడలింగ్ రంగం నుంచి వచ్చిన ఈమె ఫ్యాషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఘాటు ఘాటుగా ఫొటోలకి పోజులిస్తూ ఊరిస్తుంటుంది. అలాంటి మాళవిక మాస్ పాటలో కనిపిస్తానంటే కుర్రకారు ఆతృతగా ఎదురు చూడకుండా ఉంటారా? ప్రభాస్‌తో కలిసి నటిస్తున్న 'రాజాసాబ్' సినిమాలోనే మాస్ పాటతో సందడి చేస్తానని ఇటీవల చెప్పిందీమె. అన్నట్టు ఈమెకి తెలుగులో ఇదే తొలి చిత్రం. అందంతో కట్టిపడేస్తున్న ఈమె అనుకోకుండానే కెమెరా ముందుకు వచ్చిందట. తెర ముందు కనిపించడం కంటే, నాకు తెరవెనక ప్రపంచమే ఇష్టమని... అన్నీ అనుకున్నట్టు జరిగి ఉంటే తాను దర్శకురాలినో లేదంటే ఛాయా గ్రాహకురాలినో అయ్యేదాన్నని చెబుతోంది. ఈమె తండ్రి కేయూ మోహనన్ ప్రముఖ ఛాయా గ్రాహకుడు. తండ్రి బాటలోకి వెళ్లాలనుకున్న మాళవికని, ఆమె అందమే కెమెరా ముందుకు తీసుకొచ్చింది.





# క్షమాపణలు మాత్రమే చెప్పగలను

## – దర్శకుడు మణిరత్నం

**సినిమా డెస్క్:** తన దర్శకత్వంలో వచ్చిన 'థగ్ లైఫ్' ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయిందన్నారు దర్శకుడు మణిరత్నం. ఈ విషయంలో ఆడియన్స్‌కు క్షమాపణలు చెప్పారు. ప్రేక్షకులు మరో క్లాసిక్‌ను ఆశించారని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'థగ్ లైఫ్' ఫలితంపై స్పందించారు. ''మా ఇద్దరి నుంచి మరో 'నాయకుడు'ను ఆశించిన వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. మమ్మల్ని క్షమించండి. ఆ సినిమా కంటే తక్కువ దాన్ని చేయడం మా ఉద్దేశం కాదు. అలాంటి ఆలోచన మాకెప్పుడూ లేదు. అలా ఎలా చేయాలనుకుంటాం. మేం పూర్తిగా భిన్నమైన దాన్ని అందించాలనుకున్నాం. ఎక్కువ అంచనా వేయడంతో మేం అనుకోని ఫలితాన్ని అందుకున్నాం. మేము అందించిన దాని కంటే ఆడియన్స్ భిన్నంగా కోరుకున్నారని అర్థం చేసుకున్నా'' అని మణిరత్నం అన్నారు. ప్రస్తుతం, ఆయన తన తర్వాత సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌తో వచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన పనులు కూడా ప్రారంభించారు. కమల్ హాసన్-మణిరత్నం కాంబినేషన్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు' అప్పట్లో ఓ సంచలనం. దాదాపు 37 ఏళ్ల తర్వాత వీరి కాంబోలో తెరకెక్కిన చిత్రమే 'థగ్ లైఫ్'. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. జూన్ 5న విడుదలైన ఈ సినిమా నిరాశపర్చింది.

# డ్రగ్స్ కేసులో శ్రీరామ్ అరెస్ట్.. వైద్య పరీక్షలో పాజిటివ్!



సినిమా డెస్క్: డ్రగ్స్ కేసులో సినీ హీరో శ్రీరామ్ అలియాస్ శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఐఏడీఎమ్కే మాజీ నేత, ప్రముఖ రాజకీయవేత్త నుంచి శ్రీరామ్ డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు ఆరోపణలున్నాయి. డ్రగ్స్ కేసులో అరెస్టయిన వారు ఇచ్చిన సమాచారంతో నటుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని నుంగంబాక్కం స్టేషన్‌కు తరలించి సుమారు రెండు గంటలుగా విచారిస్తున్నారు. నటుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలినట్లు తెలుస్తోంది.

## అసలేం జరిగింది?

చెన్నైలోని ఓ బార్‌లో ఏఐఏడీఎమ్‌కే మాజీ నేత ప్రసాద్ తాగి గొడవకు దిగాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారించగా డ్రగ్స్ వ్యవహారం బయటపడింది. హీరో శ్రీరామ్ కోసం ప్రదీప్ అనే వ్యక్తి తన దగ్గర కొకైన్ కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఈ వ్యవహారంలో నటుడు దాదాపు నాలుగున్నర లక్షల రూపాయల అనుమానాస్పద లావాదేవీలు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. ప్రదీప్‌కు 40 సార్లు డ్రగ్స్ అమ్మినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో శ్రీరామ్‌ను అదుపులోకి తీసుకుని పరీక్షలు చేయగా డ్రగ్స్ వాడినట్లు తేలిందని వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై హీరో శ్రీరామ్ స్పందించాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.